

మోతకు.. బై..బై..!





పిల్లలను బడికి పంపాలంటే వారు మోసే బ్యాగులను చూసి తల్లిదండ్రులు బాధపడేవారు. ఒకటో తరగతికే కేజీల కొద్దీ బరువైన బ్యాగులను మోయాల్సి వచ్చేది. ఈ మోత పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బడిపిల్లలకు బ్యాగుల భారం తగ్గించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు సెమిస్టర్ విధానాన్ని తీసుకొచ్చి, ఒకే పుస్తకంలో మూడు సబ్జెక్టుల దాకా ముద్రించారు. దీంతో బ్యాగుల భారం సగం తగ్గించారు. దీంతో విద్యార్థులకు భారం తగ్గడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ధర్మవరం, ఆంధ్రజ్యోతి

విద్యార్థులకు తగ్గిన బ్యాగ్గుల భారం.. 1 నుంచి 9వ తరగతి వరకు మారిన పాఠ్యపుస్తకాలు

మూడు సబ్జెక్టులు కలిపి..

గతంలో 1, 2 తరగతులకు తెలుగు, ఇంగ్లిష్, గణిత పాఠ్యపుస్తకాలు వేర్వేరుగా ఉండేవి. వర్క్‌బుక్‌లు సైతం వేర్వేరుగా ఉండేవి. దీంతో 1, 2 తరగతుల విద్యార్థులు మొత్తం ఆరు పుస్తకాలు మోయాల్సి వచ్చేది. ప్రస్తుతం 1, 2 తరగతులకు సెమిస్టర్‌కు రెండేసి పుస్తకాలు మాత్రమే ఉండేటట్లు రూపొందించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం కలిపి ఒకే పాఠ్యపుస్తకంగా తయారు చేశారు. వర్క్‌బుక్ కూడా ఒకటే. దీంతో విద్యార్థులు కేవలం రెండు పుస్తకాలు తీసుకుని వస్తున్నారు. 3 నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ కలిపి, పరిసరాల విజ్ఞానం కలిపి ఒక్కో పుస్తకంగా రూపొందించారు. 6 నుంచి 9వ తరగతికి సంబంధించి తెలుగు, హిందీ, ఇంగ్లిష్

సెమిస్టర్ విధానంలో ముద్రణ

కలిపి ఒక పుస్తకంగా తయారుచేశారు. జీవ, భౌతిక శాస్త్రాలను ఒకటిగా, భౌగోళిక, చరిత్ర, ఆర్థిక, పౌరశాస్త్రాలను కలిపి ఒక పుస్తకంగా అందించారు.

పదో తరగతికి పాత పద్ధతిలోనే..

పదిలో సెమిస్టర్ విధానాన్ని ప్రస్తుత విద్యాసంవత్సరంలో అమలు చేయట్లేదు. పాతపద్ధతిలో 14 పాఠ్యపుస్తకాలు ఉండేవి. ఇప్పుడు 10 అందుబాటులోకి రానున్నాయి. వీరికి పాతపద్ధతిలోనే పరీక్షలు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీతోపాటు లెక్కలు, భౌతిక, జీవ, భౌగోళిక, అర్థ శాస్త్రాలు, చరిత్ర పాఠ్యపుస్తకాలు, ఇంగ్లీషు వర్క్‌బుక్ అందజేస్తారు.

పరీక్షా విధానంలో మార్పులు

మారిన పాఠ్యపుస్తకాలకు అనుగుణంగా పరీక్షా విధానంలోనూ మార్పులు చేశారు. గతంలో ఫార్మాటివ్ ఎసెస్‌మెంట్లుగా వ్యవహరించే యూనిట్ టెస్టులను ఇకపై సెల్ఫ్ ఎసెస్‌మెంట్ టెస్టులుగా పిలుస్తారు. సెమిస్టర్-1, సెమిస్టర్-2కి రెండు చొప్పున టెస్టులు ఉండనున్నాయి. సెమిస్టర్-1కి సంబంధించి సమ్మెటివ్ ఎసెస్‌మెంట్-1 నిర్వహిస్తారు. సమ్మెటివ్ ఎసెస్‌మెంట్‌లో మాత్రం సెమిస్టర్-2, 1కి సంబంధించి సబ్జెక్టులతో ప్రశ్నలుంటాయి. విద్యార్థులు సెమిస్టర్-1 పూర్తయిన తరువాత ఆ పుస్తకాలను పాఠశాలలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. దీంతో విద్యార్థుల స్కూల్ బ్యాగుల్లో బరువు తగ్గుతుంది. కొత్త విధానంలో విద్యార్థులు మరింత సులభతరంగా పాఠాలు నేర్చుకునే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు అంటున్నారు.

మోత సమస్య తీరింది..



గతేడాది 1వ తరగతి విద్యార్థులకు 6 పాఠ్యపుస్తకాలు ఉండేవి. వాటితోపాటు నోటు పుస్తకాలు కలిపి బ్యాగులో వేసుకుంటే బరువుగా ఉండేది. వాటిని విద్యార్థులు మోయలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తేవి. ప్రస్తుతం ఆ సమస్య కూడా తీరింది.

-శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పాఠ్యాంశాలూ తగ్గాయి..



గతంలో ఒక్కో సబ్జెక్టుకు రెండు పుస్తకాలు ఉండేవి. దీంతో విద్యార్థులు పుస్తకాల భారంతో ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం పుస్తకాల భారంతోపాటు పాఠ్యాంశాలను తగ్గించి మూడు సబ్జెక్టులను ఒక పుస్తకంగా ముద్రించింది. దీంతో పుస్తకాల బరువు తగ్గింది.

- ఆర్ చంద్ర, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

50శాతం పుస్తకాల భారం తగ్గింది



గతంలో ఒక్కో సబ్జెక్టుకు టెక్స్ట్, వర్క్‌బుక్‌లు ఉండేవి. దీంతో పుస్తకాల బరువు కూడా అదేస్థాయిలో ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం సెమిస్టర్ విధానంలో మూడు సబ్జెక్టులకు కలిపి పుస్తకం ముద్రించడం తో 50 శాతం వరకు పుస్తకాల బరువు తగ్గింది.

-శ్రీనివాసరావు, విద్యాశాఖ ఏడీ1

కరెన్సీ సారు..!

వైసీపీ అండతో ట్రాన్స్‌కో ఏఈ వసూళ్ల పర్వం

- రూ.7.50 కోట్ల మేర అక్రమాల ఆరోపణలు
- డీడీలు తానే కడతానంటూ రైతుల నుంచి వసూలు
- ట్రాన్స్‌ఫార్మర్‌కు సైతం అదనంగా ఇచ్చుకోవాల్సిందే..
- బాధితుల ఫిర్యాదులు
- కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ



పుట్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఓ ఏఈ అవినీతి కోట్లు దాటింది. కరెంటు శాఖలో ఆయన కరెన్సీ సారుగా మారిపోయాడు. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల అండతో రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేసినట్లు బాధితులు మండిపడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, వైరు కోసం డీడీలు తానే కడతానంటూ రైతుల నుంచి డబ్బు గుంజాడంట. ట్రాన్స్‌ఫార్మర్, వైరు కావాలంటే అదనంగా ఇవ్వాలంటూ పెద్ద మొత్తంలో వసూలు చేశాడట. ఇటీవలి వరకు ఆ ఏఈ పనిచేసిన తాడిపత్రి నియోజకవర్గంలోని ఓ మండలంలో రూ.7.5 కోట్ల మేర అక్రమంగా వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకుని కూడా డీడీలు కట్టకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్, వైరు ఇవ్వకపోవడంతో పలువురు రైతులు.. ఆ ఏఈపై ఫిర్యాదు చేశారు. విషయం తన దృష్టికి రావడంతో ప్రజాప్రతినిధి తీవ్ర స్థాయిలో మండిపడినట్లు తెలుస్తోంది. ఏఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ కోరినట్లు సమాచారం. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ ఏఈ ఇటీవల శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలానికి బదిలీ అయ్యారు. అయినా.. ఆయన తీరు ఏమాత్రం మారలేదన్న వాదనలు

(మిగతా 4లో...)

నానాటికీ తీసికట్టు

- ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ కరువు
- ఏటేటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- కాశేపల్లిలో గత ఏడాది నుంచి ఒకే విద్యార్థి



కాశేపల్లి గ్రామంలో ఒక్క విద్యార్థికి పాఠం చెబుతున్న టీచర్

పెద్దవడుగూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు ఏటికేడు ఆదరణ కొరవడుతోంది. దీంతో విద్యార్థుల సంఖ్య నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన, రుచికరమైన ఆహారం, దుస్తులు, పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నా అటు వైపు వెళ్లే వారి సంఖ్య ప్రతి ఏడాది తగ్గుతోంది. మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, కస్తూర్బా గాంధీ పాఠశాల మొత్తం 47 పాఠశాలలు ఉన్నాయి. విద్యాబోధనకు 198 ఉపాధ్యాయులు ఉన్నారు. గతేడాది అధికారుల లెక్కల ప్రకారం 3491మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. పేద ప్రజల విద్యాప్రమాణాలు పెంచడం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. 2023-24 సంవత్సరంలో 4135 విద్యార్థులు, 2024-25 సంవత్సరం 3491 మంది విద్యార్థులు

(మిగతా 4లో..)

మడమ తిప్పని మృత్యువు



దేవరపల్లి జయకుమార్ (ఫైల్)

మృత్యు దేవత అతన్ని తోడ్కొని వెళ్లేందుకు వచ్చింది. తల్లి, చెల్లి అడ్డుకున్నా.. నిర్దాక్షిణ్యంగా తన నిర్ణయాన్ని అమలు చేసింది. ఇప్పటికే భరించలేని కష్టాల్లో ఉన్న ఆ కుటుంబంలో అంతులేని విషాదాన్ని నింపింది. ధర్మవరం పట్టణంలోని చంద్రబాబు నగర్‌లో చేనేత కార్మికుడు దేవరపల్లి జయకుమార్(25) మరణించిన తీరు కాలనీవాసులను కంటతడి పెట్టించింది. నాగరాజు, వనిత దంపతుల కుమారుడు జయకుమార్ మగ్గం నేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉండేవాడు. మూడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడికాలు విరిగింది. దీంతో మగ్గం నేయలేక కుటుంబ అవసరాలు, వైద్యానికి అప్పులు చేశాడు. వాటిని తీర్చడం కష్టంగా భావించాడు. ఒత్తిడికి లోనై గురువారం ఇంట్లో ఉరి వేసుకుంటుండగా తల్లి వనిత, చెల్లెలు కోమల గమనించి, అడ్డుకున్నారు. ఉరి నుంచి తప్పిస్తుండగా జయ కుమార్ పట్టుతప్పి కింద మగ్గానికి ఉన్న ఇనుప చువ్వపై పడ్డాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యులను విచారించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. జయకుమార్‌కు ఇంకా వివాహం కాలేదు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం

మేమింతే.. మారమంతే..!

పురం వైసీపీలో వర్గపోరు.. తెరపైకి మూడో వర్గం

జన్మదినం పేరుతో వేణు రాజకీయ విందు

అడ్డుకునేందుకు ఇన్‌చార్జ్ వర్గం యత్నం



హిందూపురం, జూన్19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో వర్గపోరుతో నలిగిపోతోంది. కుమ్ములాటలు యథావిధిగా కొనసాగుతున్నాయి. పార్టీ ఆవిర్భావంలో ఓ వర్గానికి నాయకుడిగా ఉన్న నియోజకవర్గ వైసీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ప్రస్తుతం విందు రాజకీయానికి శ్రీకారం చుట్టారు. దీంతో ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న దీపిక వర్గంలో అలజడి మొదలైంది. ఎందుకంటే కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నాడు. పార్టీలో కొంతమంది కీలకనాయకులతో ఈయనకు సత్సంబంధాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన వర్గీయులు చెప్పుకుంటున్నారు. నవీన్ నిశ్చల్, దీపిక వర్గాలతో సతమతమవుతున్న ప్రస్తుత తరుణంలో మూడో వర్గం కూడా తెరపైకి రానుందని పార్టీ నాయకులే గత కొద్దిరోజులుగా చర్చను సాగిస్తున్నారు.

జన్మదినం పేరుతో రాజకీయ విందు

వైసీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి జన్మదినం శుక్రవారం జరుపుకోనున్నారు. గతంలో ఎప్పుడూ జన్మదినాన్ని ఆర్భాటంగా చేసుకునేవాడుకాదు. ఈసారి మాత్రం భారీ ఎత్తున చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో హిందూపురం నుంచి తానే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉంటానని, త్వరలోనే తనకు మంచి పదవి రానుందని సన్నిహితులవద్ద చెప్పుకున్నట్లు సమాచారం. పార్టీలోని ముఖ్యనేతలు తనకు అభయం ఇచ్చారని, ఎంత ఖర్చయినా పెట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని వారి వద్ద చెప్పడంతో హిందూపురం వైసీపీలో రాజకీయ సమీకరణలు మారనున్నాయని ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. దీంతో శుక్రవారం వేణుగోపాల్‌రెడ్డి ఇచ్చే విందుకు ఎంతమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరవుతారోననే ఉత్కంఠ నెలకొంది.

అడ్డుకునేందుకు ఇన్‌చార్జ్ వర్గం ఎత్తుగడ

హిందూపురం మండలంలోని ఓ వైసీపీ నాయకుడి తోటలో శుక్రవారం విందు ఏర్పాటు చేశారు. దీన్ని ఎలాగైనా విఫలం చేయాలని, విందుకు పార్టీనాయకులు, కార్యకర్తలు వెళ్లకుండా అడ్డుకునేందుకు దీపిక వర్గం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే గురువారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఓ మెసేజ్‌ను పంపారు. నియోజకవర్గంలో పార్టీ తరపున పదవులు పొందిన నాయకులకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో సన్మానసభ ఏర్పాటు చేశామని, దీనికి పార్టీ పదవులు పొందిన వారితోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అయోమయంలో కార్యకర్తలు

ఇవన్నీ ఇలా ఉంటే పార్టీ ఆవిర్భావం నుంచి వైసీపీలో వర్గపోరు సమిసిపోకుండా ఉండటంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు నాయకులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. ఇప్పుడు కూడా మరోవర్గం తెరపై వస్తుందేమోనన్నది ఒక ఆలోచన. శుక్రవారం దీపిక నిర్వహించే కార్యక్రమానికి వెళ్లాలా లేదా కొండూరు వేణుగోపాల్‌రెడ్డి విందుకు వెళ్లాలా అనే విషయం కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తోంది.

మహాసభలను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్



మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

ధర్మవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓహోంలో గురువారం వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వేమయ్యయాదవ్ మాట్లాడుతూ.. ఆగస్టు 1న సీపీఐ శ్రీ సత్యసాయి జిల్లా రెండో మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పేదల సమస్యలు పరిష్కరించడంలో సీపీఐ ముందుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమవుతోందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవాను పూర్తిచేసి ఆయకట్టుకు నీరు అందించాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పేదలకు ఇళ్ల పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత రంగాన్ని కాపాడి కార్మికుల ఆత్మహత్యలను నివారించాలని కోరారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకాచలపతి, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో జిల్లాకు బహుమతులు

పుట్టపర్తి టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాలో జిల్లాకు చెందిన పలువురు వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 16నుంచి 18 వరకు డాన్‌బాస్కో స్కూల్ విజయవాడ వేదికగా నిర్వహించిన యోగా పోటీల్లో గెలుపొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం బహుమతులను ప్రకటించినట్లు ఆయన తెలిపారు. 19 నుంచి 35 ఏళ్ల వయస్సు కేటగిరి సోలో ఆసనాల్లో హిందూపురానికి చెందిన దేవయానికి రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి లభించింది. అలాగే గ్రూప్ విభాగంలో హిందూపురానికి చెందిన దేవయాని, మమత, శిల్పారాణికి తృతీయ బహుమతి దక్కింది. జూనియర్ గ్రూప్ విభాగంలో 10 నుంచి 18 ఏళ్ల వయస్సు కేటగిరిలో రొళ్లకు చెందిన తనుశ్రీ రాష్ట్ర స్థాయిలో రెండోస్థానం, ముదిగుబ్బకు చెందిన రుచితకు మూడో స్థానం లభించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఆగని ఇసుక దందా

గుల్లవుతున్న వాగులు, వంకలు

రాజకీయ దళారీల అండతో యథేచ్ఛగా రవాణా

చూసీచూడనట్లు ఉంటున్న అధికారులు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

పుట్టపర్తి టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. చిత్రావతి నదిలో యంత్రాలతో బహిరంగంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తోంది. ఇసుకాసురులు చిత్రావతి నదితోపాటు చుట్టుపక్కలున్న వాగులు, వంకలు, కుంటల్లో కూడా ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. అక్రమంగా తవ్విన ఇసుకను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థ ఆవరణలో డంపు చేసినట్లు సమాచారం. కొత్తచెరువు మండలం వంగటేరు నదిలోకూడా ఇసుక అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది.

రాజకీయ దళారీల అండతో...

పుట్టపర్తికి చెందిన ఓ రాజకీయ దళారి అండతో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులను మచ్చిక చేసుకుని, భారీ మొత్తంలో వారికి ముడుపులు చెల్లించి ఇసుక దాందాను నడిపిస్తున్నట్లు సమాచారం. అధికారులు దాడులు చేయకుండా కాపాడటం ఈదళారీ బాధ్యత.

అక్రమ రవాణాను అరికట్టాలి: కలెక్టర్

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఆయన జిల్లాస్థాయి ఇసుక కమిటీ డీఎల్‌ఎస్‌సీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి ఇసుక విధానంపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేసి, అరికట్టాలన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పారదర్శకంగా సరఫరా చేయాలన్నారు.

వైద్యశాఖలో బదిలీల గోల

- మినహాయింపుల కోసం కోర్టుకు సంఘాలు
- సమీక్షించాలని న్యాయస్థానాల ఆదేశం
- కౌన్సెలింగ్‌లో కొనసాగుతున్న గందరగోళం
- ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి



అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ కోసం నిరీక్షిస్తున్న స్టాఫ్‌నర్సులు

అనంతపురం వైద్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో సాధారణ బదిలీల ప్రక్రియ గోలగోలగా సాగుతోంది. జోనల్ కేడర్ల ఉద్యోగులను ఆర్డీ బదిలీ చేస్తున్నారు. జిల్లా కేడర్‌లో బదిలీల కౌన్సెలింగ్‌ను డీఎంహెచ్‌ఓ నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో తమ కార్యవర్గంలోని ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఉద్యోగ సంఘాలు కోర్టులను ఆశ్రయిస్తున్నాయి. మెడికల్ గ్రౌండ్, స్పౌజ్, అసోసియేషన్ లెటర్స్ తదితర మినహాయింపులు వర్తింపజేయాలని కోరుతున్నాయి. వాటిని పరిశీలిస్తున్న న్యాయస్థానాలు, సమీక్షించాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశిస్తున్నాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు మినహాయింపులు వర్తింపజేస్తామని కౌన్సెలింగ్‌లోనే వైద్యశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. బుధవారం నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌ను సమీక్షిస్తామని చెప్పారు. కానీ అవేమీ జరగలేదని, అంతా గందరగోళంగా ఉందని ఉద్యోగ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విధుల్లో లేకుండా కౌన్సెలింగ్ కోసం రేయింబవళ్లు నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నాయి.

కోరుకున్న ప్రాంతం దక్కుతుందా..?

కడప జోన్-4 పరిధిలో అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప జిల్లాలోని వైద్య, ఆరోగ్య కేంద్రాల ఉద్యోగులను బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే కోరుకున్న ప్రాంతాలు దక్కిన వారు ఆనందంగా ఉన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కౌన్సెలింగ్‌ను సమీక్షిస్తే (రివైజ్) తమకు కోరుకున్న ప్రాంతం దక్కుతుందా? అని మినహాయింపు వర్తించే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఆశించిన స్థానాలను దక్కించుకున్న ఉద్యోగులు వదులుకుంటారా అన్న సందేహాలు

(మిగతా 5లో..)

నర్సింగ్‌తో విదేశాల్లోనూ

అవకాశాలు



- బాధితులకు సేవ చేసే అవకాశం
- భవిష్యత్తుకు భరోసా
- కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఉద్యోగాలు
- దరఖాస్తుకు నేడే ఆఖరు
- జూలై 6న పరీక్ష

4



బాధితులకు సేవ చేసే అవకాశం

భవిష్యత్తుకు భరోసా

కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఉద్యోగాలు

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

జూలై 6న పరీక్ష

నర్సింగ్‌తో విదేశాల్లోనూ అవకాశాలు

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీఎన్‌సెట్-2025) నిర్వహించనున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా కింద నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు శుక్రవారం వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నాలుగు సంవత్సరాల బీఎస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాలు పొందాలంటే ఇంటర్మీడియట్‌గానీ, తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. http-s://drntr. uhsap.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. జూలై 6న పరీక్షలు నిర్వహించనున్నారు. ఏపీఎన్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఉమ్మడి జిల్లాలోని ఒక ప్రభుత్వ, తొమ్మిది ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందవచ్చు.



5 సబ్జెక్టులు, 100 మార్కులు...

ఆన్‌లైన్ విధానంలో ఏపీఎన్‌సెట్ నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో చదివిన పాఠాలనే ప్రశ్నపత్రంగా రూపొందిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్, నర్సింగ్ ఆప్టిట్యూడ్ ఈ ఐదు సబ్జెక్టుల్లో 20 ప్రశ్నల చొప్పున మొత్తం 100 మార్కులుంటాయి. ఉమ్మడి జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

అనంతపురం వైద్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎంతోమంది విదేశాల్లో ఉద్యోగం సాధించాలని కలలు కంటుంటారు. వాటిని నిజం చేసుకోవాలంటే ఇంజనీరింగ్, కంప్యూటర్, మెడిసిన్ కోర్సులు చేసేవారు. ఆర్థిక స్థోమతలేని విద్యార్థులకు విదేశీ కలలు కల్లలుగానే మిగిలిపోయేవి. అలాంటి వారు బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేస్తే విదేశాల్లో ఉద్యోగ కలను నెరవేర్చుకోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు పొందవచ్చు. కార్పొరేట్ వైద్య సంస్థల్లో సైతం భారీ



అనంతపురం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల



ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేస్తే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. వైద్య రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో బీఎస్సీ నర్సింగ్‌కు అవకాశాలు కొదవలేవని నిపుణులు పేర్కొంటున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అందిస్తున్న నాలుగేళ్ల నర్సింగ్ బీఎస్సీ కోర్సును పూర్తి చేస్తే ఉద్యోగాలు వెతుక్కోవాల్సిన అవసరం లేదని వైద్యవర్గాలు సూచిస్తున్నాయి.

పీహెచ్‌డీతో రీసెర్చ్...

బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు పీజీ చేసి, పీహెచ్‌డీలో రీసెర్చ్ చేయవచ్చు. తద్వారా నర్సింగ్ కళాశాలల్లో ట్యూటర్, లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా బోధనావకాశాలు అందిపుచ్చుకోవచ్చు. కళాశాలల్లోనే ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి కార్పొరేట్ వైద్యసంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. బీఎస్సీ నర్సింగ్ అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వమే స్టైపండ్ చెల్లిస్తుంది. జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అనంతపురం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉచితంగా ఆ దేశ భాష నేర్పిస్తున్నారు.

కనీస మార్కులు...

నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించాలంటే ఇంటర్మీడియట్‌లో సైన్స్ సబ్జెక్టుల్లో కనీస మార్కులు సాధించి ఉండాలి. ఐసీఎస్ఈ, ఎస్ఎస్‌సీఈ, హెచ్ఎస్‌సీఈ, ఎన్ఐఏఎస్, ఏపీఓఎస్ఎస్ తదితర బోర్డుల నుంచి ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులున్నా అర్హులే.

విదేశాల్లోనూ అవకాశాలు



నర్సింగ్ చేసిన విద్యార్థులకు విదేశాల్లోనూ అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. బీఎస్సీ నర్సింగ్‌తో పాటే జర్మన్ భాషను రాష్ట్ర ప్రభుత్వం.. విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తుంది. తద్వారా జర్మనీలో ఉద్యోగాలు పొందుతున్నారు. కళాశాల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఉచితంగా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేయవచ్చు. కళాశాలలోనే ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి కార్పొరేట్ వైద్యసంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

-ప్రొఫెసర్ అనంతమ్మ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

వైద్యసేవల్లో కీలక పాత్ర



వైద్యసేవల్లో నర్సింగ్ విభాగం కీలక పాత్రపోషిస్తుంది. బాధితులు ఆస్పత్రిలో చేరినప్పట్నుంచి డిశ్చార్జి అయ్యేవరకు అన్ని సేవలను నర్సులు అందిస్తారు. వైద్యరంగం విస్తరణలో భాగంగా ఆస్పత్రుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నర్సింగ్‌ను ఎంచుకున్న విద్యార్థులు అవకాశాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. ప్రాథమిక వైద్యకేంద్రాలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తోంది.

- మంగమ్మ, హెడ్‌నర్స్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

జీవితానికి భరోసా..



మా అమ్మానాన్న రైతు కూలి పనులు చేసి బీఎస్సీ నర్సింగ్ చదివించారు. స్టాఫ్‌నర్స్‌గా ఉద్యోగం లభించింది. బాధితులకు వైద్యసేలందించడంతోపాటు వ్యక్తిగతంగా నర్సింగ్ విద్య జీవితానికి భరోసా కల్పిస్తుంది. పేద, మధ్యతరగతి విద్యార్థులు డిగ్రీ సమానమైన బీఎస్సీ నర్సింగ్‌తో ఉద్యోగ కలను సాకారం చేసుకోవచ్చు.

-అనురాధ, స్టాఫ్‌నర్స్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి



వరండాలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

వరండాలో పాఠాలు

- వైటీ చెరువు జడ్పీ హైస్కూల్‌కు గదుల కొరత
- వరండాలోనే విద్యా బోధన.. విద్యార్థుల అవస్థ
- కొత్త భవనం పూర్తి చేయాలని తల్లిదండ్రుల విన్నపం

గుంతకల్లు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతో ప్రగతి సాధించామని చెబుతున్నా కొన్ని చోట్ల విద్యార్థులకు నేలబారు చదువులు తప్పడం లేదు. తరగతి గదులు లేక వరండాల్లోనే చదువుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. మండలం లోని వైటీచెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు 222మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. పాఠశాలలో 5 గదులు మాత్రమే ఉన్నాయి. అందులో మూడు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక గదిని స్టోర్‌రూంగా వినియోగించుకుంటున్నారు. మరో గదిలో ప్రధానోపాధ్యాయుడు గది, రికార్డు గది, ఇతర సామగ్రిని ఉంచడం కోసం వాడుకుంటున్నారు. ఉపాధ్యాయులకు కూర్చునేందుకు గది లేకపోవడంతో పాఠశాల తరగతి గదిలోనే ఉంటున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. నెలకొంది. మహిళా టీచర్లు, విద్యార్థినులకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. 6,7,8 తరగతులను పాఠశాల వరండాలో నిర్వహిస్తున్నారు. పిల్లలు ఆడుకోవడానికి మైదానం లేదు. వంట గది లేకపోవడంతో ఆరు బయటే వంట చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిలిచిపోయిన పనులు

నాడు-నేడు ఫేస్-2 కింద మంజూరైన పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు నిధులు లేక నిలిచిపోయాయి. మూడేళ్ల కిందట ప్రారంభమైన భవన నిర్మాణ పనులు 80శాతం పూర్తయ్యాయి. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన పనులు అలాగే నిలిచిపోయాయి. దీంతో పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆరుబయట వంట చేస్తున్న మహిళలు



నిధులు లేక నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణం

మెరిసేదంతా బంగారమే!

- బంగారానికి ప్రత్యామ్నాయంగా రోల్డుగోల్డు
- అందుబాటులో రకరకాల డిజైన్లు
- తక్కువ ధరలో అందమైన ఆభరణాలు
- ఆసక్తి చూపుతున్న మహిళలు

కదిరి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు బంగారం ధర సామాన్యులకు అందకుండా రేసుగుర్రంలా పరిగెడుతోంది. మరోవైపు బంగారం నగలు ఇంటిలో పెట్టుకున్నా, ధరించి బయట తిరిగినా దొంగ ల భయం. ఈ నేపథ్యంలో మహిళలు ఇటీవల కాలంలో బంగారం నగలకు ప్రత్యామ్నాంగా రోల్డుగోల్డు ఆభరణాలపై ఆసక్తి చూపుతున్నా రు. తక్కువ ఖర్చుతో కోరుకున్న డిజైన్లలో నగలు లభిస్తుండటంతో మహిళలు వీటి పట్ల మొగ్గు చూపుతున్నారు. సంపన్న వర్గాలకు చెందిన మహిళలు సైతం శుభకార్యాల్లో రోల్డుగోల్డు వస్తువులు ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అభిరుచికి తగ్గట్టుగా వందలాది డిజైన్లల్లో అందుబాటులోకి వచ్చాయి. రోల్డుగోల్డు ఆభరణాలు ధరించడం ఫ్యాషన్‌గా మారడంతో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

మ్యాచింగ్ కోసం

ఇటీవల మహిళలు, యువతుల్లో ఫ్యాషన్ పట్ల ఆసక్తి పెరిగింది. డ్రస్సుకు మ్యాచ్ అయ్యే ఆభరణాలు ధరించేవారి సంఖ్య పెరుగుతోంది. ధరించిన డ్రస్సుకు సరిపోయేలా రోల్డుగోల్డులో వివిధ రకాలు నగలు లభిస్తున్నాయి. ఈక్రమంలో వివిధరకాల రాళ్లతో(స్టోన్స్‌తో) తయారు చేసిన ఆభరణాలను చాలామంది యువతులు ఇష్టపడుతున్నారు. ఇంక ఆఫీసులకు వెళ్లేవారైతే సన్నని గొలుసుతోపాటు, బ్రాస్‌లెట్ లాంటివి ధరిస్తున్నారు. నల్లపూసల దండలు కూడా రోల్డుగోల్డులో లభిస్తుండటం తో ఎక్కువ మంది మహిళలు వాటిని ధరించడానికి ఇష్టపడుతున్నారు.

విభిన్న మోడల్స్‌లో...

రోల్డుగోల్డులో పాపిడిబిళ్లలు, గాజులు, హారాలు, లాగ్స్ సెట్స్, చెవి దుద్దులు, వడ్డాణాలు వంటి ఆభరణాలు రకరకాల మోడల్స్‌లో లభిస్తున్నాయి. డిజైన్ బట్టి రూ.ఐదు వందల నుంచి రూ. ఆరు వేల వరకు ధరలు ఉన్నాయి.

పెళ్లిళ్లకు మరింత ప్రత్యేకంగా..

వివాహాల సమయంలో వధువు మరింత అందంగా కనిపించాలంటే ఆభరణలు ఉండాల్సిందే. తక్కువ ఖర్చుతో రోల్డుగోల్డు ఆభరణాలు కొనుగోలు చేసి, వాటిని అలంకరిస్తుంటారు. వివాహాల సమయంలో విక్రయాలు మరింత ఎక్కువగా ఉండటంతో, నిర్వాహకులు వెడ్డింగ్ కలెక్షన్ పేరుతో ప్రత్యేకంగా జ్యూవెలరీ తెప్పిస్తున్నారు. పెళ్లిళ్ల సమయంలో పెద్దహారం, చిన్నహారం, నక్లెస్‌లు, జుంకాలు కలిసి సెట్‌గా విక్రయిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనూ రకరకాల మోడల్స్

రోల్డుగోల్డు ఆభరణాల విక్రయాలు ఆన్‌లైన్‌లో జోరుగా సాగుతున్నాయి. ఆన్‌లైన్‌లో అత్యధికంగా గోల్డు ప్లేటెడ్ బ్రాస్‌లెట్, భరత నాట్యం కెంపులు, కెంపుల్ స్టోన్ నక్లెస్, నవరత్న చైన్‌లాకెట్, గోల్డు పార్మింగ్ తదితర రకాలు కొనుగోలు చేస్తున్నారు. వీటికి ఆన్‌లైన్‌లో డిస్కౌంట్లు ప్రకటిస్తుండటంతో వ్యాపారాలు జోరందుకున్నాయి.



రోల్డుగోల్డు ఆభరణాలు

జాగ్రత్తలు తప్పనిసరి

ఎంతో ముచ్చటపడి కొనుగోలు చేస్తున్న రోల్డుగోల్డు ఆభరణాల విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే పెట్టిన సొమ్ము వృథా అవుతుందని పలువురు చెబుతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పదేళ్లు గడిచినా పాడవకుండా ఉంటాయని వ్యాపారులంటున్నారు. వీటిని పాలిథిన్ కవర్, లేదా ప్లాస్టిక్ బాక్స్‌లో భద్రపరచాలని చెబు తున్నారు. ఆభరణాలు ధరించిన తరువాత సువాసన ద్రవ్యాలు(పర్‌ఫ్యూమ్స్) వాడకూడదని, స్నానం చేసే సమయంలో తీసి పక్కన పెట్టడం, వేడి నీటికి ఆభరణాలను దూరంగా ఉంచడం మంచిదంటున్నారు. ఉపయోగించిన తరువాత వాటిని శుభ్రం చేస్తే చాల కాలం మన్నికగా ఉంటాయని చెబుతున్నారు.

ధైర్యంగా తిరగవచ్చు: సునీత, గృహిణి, కదిరి



రోల్డుగోల్డు ఆభరణాలు ధరించి ఎక్కడైనా ధైర్యంగా తిరగవచ్చు. దొంగల బెడద ఉండదు. మహిళలకు అందాన్ని ఇవ్వడమేకాకుండా తెలికగా ఉంటాయి. ఈఆభరణాల వల్ల మహిళలు ఇబ్బందులు పడరు. బంగారు ఆభరణాలు అయితే ప్రతి క్షణం వాటిగురించే ఆలోచిస్తూ ఉండాలి.

అందంగా కనిపిస్తాం: హరిత, ఉపాధ్యాయురాలు, కదిరి



బంగారు ఆభరణాలకు తీసిపోని రీతిలో రోల్డుగోల్డు ఆభరణాలు ఉంటున్నాయి. వీటిని ధరించడం వల్ల చాలా అందంగా కూడా కనిపిస్తాము. పైగా బంగారం ధరలు ఎక్కువగా ఉండటం, రోల్డుగోల్డు వస్తువులు తక్కువకు దొరుకుతుండటంతో చాలా మంది వీటికి ఆకర్షితులవుతున్నారు. రకరకాల డిజైన్లలో ఆభరణాలు లభిస్తుండటంతో ప్రాధాన్యం ఇస్తున్నాం.

మహిళల ఆసక్తి పెరిగింది: రవీంద్రారెడ్డి, వ్యాపారి, కదిరి



ఇటీవల రోల్డుగోల్డు ఆభరణాలపై మహిళలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణ మహిళ నుంచి సంపన్న వర్గాలు, ఉద్యోగుల వరకు ఈఆభరణాలను ఎంచుకుంటున్నారు. మహిళల అభిరుచుల మేరకు అన్నిరకాల డిజైన్లు అందుబాటులో ఉంచుతున్నాం.

కరెన్సీ సారు..!

(3వ పేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతినిధులను అడ్డుపెట్టుకొని నకిలీ బిల్లులు సృష్టించి లక్షలాది రూపాయలు ఆర్జించాడన్న ఆరోపణలు సైతం ఆ అధికారిపై వినిపిస్తున్నాయి.

లక్షలు ముట్టజెప్పాల్సిందే..

రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆ ఏఈ నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడన్న ఆరోపణలున్నాయి. రైతులు కట్టే డీడీల కన్నా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నాడన్న విమర్శలున్నాయి. ఒక్కో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే. రైతులతో నేరుగా డీడీలు కట్టించుకోకుండా తనకే నగదు ఇవ్వాలని డిమాండ్ చేసేవాడని తెలుస్తోంది. ఇలా ఏళ్ల తరబడి అక్కడే ఉండి లక్షలాది రూపాయలు ఆర్జించాడన్న ఆరోపణలు ఉన్నాయి. సుమారు 458 మంది రైతుల నుంచి వసూలు చేశాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి అధికారం చేపట్టాక ఆ అధికారి ఆటలు సాగలేదు. సాధారణ బదిలీల్లో భాగంగా శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆ మండలంలో కూడా ఆయన తీరులో మార్పు లేదని తెలుస్తోంది.

డీడీలు తానే తీస్తానంటూ..

సాధారణంగా రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అందుకయ్యే ఖర్చును విద్యుత్ అధికారులు అంచనా వేసి, చెబుతారు. అంత మొత్తానికి బ్యాంకులో డీడీ తీసి, ఏఈకి ఇవ్వాల్సి ఉంటుంది. ఆ అధికారి మాత్రం నగదు తనకే ఇవ్వాలనీ, తానే డీడీ తీస్తానంటూ రైతులను డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. రైతులే నేరుగా డీడీలు చెల్లిస్తే ఎంత హార్స్ పవర్‌కు ఎంత అమౌంట్ చెల్లించామనేది తెలుస్తుంది. రైతుల నుంచి అధికంగా వసూలు చేసి, ఆయన డీడీలు తీసేవాడట. ఇలా రైతుల నుంచి అంచనాల కంటే అధికంగా డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విస్తుపోయిన ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వంలో రైతుల నుంచి అడ్డగోలుగా వసూలుచేసిన ఆ అధికారి గురించి తెలుసుకున్న ప్రజాప్రతినిధి విస్తుపోయారని తెలుస్తోంది. రూ.7.50 కోట్ల మేర అవకతవకలకు పాల్పడినట్లు ప్రజాప్రతినిధి దృష్టికి రావడంతో తక్షణమే ఆ అధికారిపై విచారణ జరపాలని విజిలెన్స్ అధికారులను కోరినట్లు సమాచారం. ఇలాంటి అధికారి తమకు వద్దంటూ బదిలీ చేయించినట్లు తెలుస్తోంది.

నానాటికీ తీసికట్టు

(3వ పేజీ తరువాయి)

విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు లేకపోవడంతో కొన్ని పాఠశాలలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని కాశేపల్లి గ్రామంలో దాదాపు 50మంది విద్యార్థులను గుత్తి, మిడుతూరు గ్రామాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. కాశేపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఒక విద్యార్థిని మాత్రమే వెళుతోంది. ఆమెకు ఒక ఉపాధ్యాయురాలు విద్యాబోధన చేస్తున్నారు. యాజమాన్యాల ప్రచార మాయలో పడి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేందుకు మొగ్గు చూపుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం: రాముడు, ఎంఈఓ



ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే మౌలిక సదుపాయలు, నాణ్యమైన విద్య గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. మరింత విస్తృతంగా గ్రామాల్లో పర్యటించి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకుంటాం. ఇక కాశేపల్లి గ్రామంలో పిల్లలను బడికి పంపమని గత ఏడాది ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రులను అడిగితే వారు నిరాకరించారు. ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా కూడా తెలియజేశారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో జీఎం తనిఖీలు

గుంతకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) అరుణ్ కుమార్ జైన్ గురువారం సాయంత్రం స్థానిక రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. ఉదయం రైల్వే డివిజన్‌లోని తిరుపతి, రేణిగుంట స్టేషన్లను, అభివృద్ధి పనులను పరిశీలించిన జీఎం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక రైలులో రీర్ విండో ద్వారా రేణిగుంట-గుంతకల్లు మధ్యన ఉన్న రైల్ ట్రాక్ నాణ్యతను పరిశీలించారు. సాయంత్రం నాలుగున్నరకు గుంతకల్లుకు చేరిన జీఎం స్థానిక డీజిల్ షెడ్‌ను సందర్శించారు. అక్కడ నూతనంగా నిర్మించిన సోలార్ పవర్ వ్యవస్థను ప్రారంభించారు. యాగ్జిలరీ సర్వీస్ భవనాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లగా.. నెలాఖరున జీఎం ఉద్యోగ విరమణ ఉండటంతో ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయనను సన్మానించారు. డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ తదితరులతో జీఎం సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

రెచ్చగొట్టేలా జగన్ మాటలు

- తల్లి, చెల్లిని గెంటేసి, ఇప్పుడు మహిళలపై సానుభూతి
- 70 శాతం రెడ్లకు పదవులిచ్చి, కమ్మవాళ్లపై ఇప్పుడా ప్రేమ?
- మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



అనంతపురం క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో రెట్టింపు సంక్షేమం అమలవుతూ ఉంటే తట్టుకోలేని జగన్ తన సైకో బ్యాచ్‌తో రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నాడని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. అనంతపురం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించేలా జగన్ వ్యవహరిస్తున్నాడన్నారు. 80 కిలోమీటర్లు ర్యాలీగా వెళ్లవద్దంటూ పోలీసులు చెప్పినా ఆయన పట్టించుకోలేదన్నారు. సభ నిర్వహించరాదన్నా ముందుకెళ్లి ఇద్దరి చావుకు కారణమయ్యాడంటూ విమర్శించారు. బెట్టింగ్‌లు ఆడి నాగమల్లేశ్వర్‌రావు ఏడాది కిందట మరణిస్తే.. ఇప్పుడు గుర్తుకు రావడం రాజకీయ డ్రామా అన్నారు. జగన్ కోసం వచ్చిన ఇద్దరు చనిపోతే...ఒక్క నిమిషం వాళ్ల కుటుంబీకులకు మాట్లాడించలేదన్నారు. జగన్ ఏపీలో కమల్‌హాసన్ లాగా బాగా నటిస్తున్నాడని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు, దళితులపై దాడులు, మహిళల హత్యల్లో అప్పటి జగన్ ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదన్నారు. కానీ అవన్నీ మరిచి నేడు మాట్లాడుతున్నారన్నారు. తల్లి విజయమ్మను పార్టీ నుంచి, షర్మిలను ఇంటి నుంచి గెంటేసిన ఆయన, అమరావతి మహిళలపై తన మీడియాలో వేశ్యలుగా మాట్లాడించిన జగన్ ఇప్పుడు మహిళల గౌరవం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గంజాయి తాగేటోళ్లు, రేపిస్టులు, భూకబ్జా కేసుల్లో ఉన్న వాళ్లను జగన్ పరామర్శించడానికి వెళ్లడాన్ని బట్టే జగన్ మనస్తత్వం ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. మీరు నరికితే నరికించుకుంటారా..? అవతలి వాళ్లకు చేతులు ఉండవా... వేట కొటవళ్లు ఉండవా అని ప్రశ్నించారు. 2029లో అధికారంలోకి వస్తే అంటూ రెచ్చగొడితే ప్రజలు అధికారం కట్టబెట్టరని, మీ మాటలకు ప్రజల దగ్గర సమాధానం ఉందంటూ సూచించారు. ఇద్దరు పిల్లలుంటే అమ్మఒడి రూ. 30 వేలు ఇస్తామని చెప్పి, అర్ధ ఒడిగా చేశారన్నారు. తన ప్రభుత్వంలో 70 శాతం పదవులు తన సామాజికవర్గం వాళ్లకు ఇచ్చి, ఇప్పుడు కమ్మ వాళ్లపై ప్రేమ చూపడం హాస్యాస్పదమన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో వందకు వంద శాతం రెట్టింపు సంక్షేమం అమలవుతోందన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీ కొని వ్యక్తి మృతి


సయ్యద్‌ఖాసీం(ఫైల్)

గుత్తి, జూన్19(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో లారీ ఢీకొని సయ్యద్ ఖాసీం(55) గురువారం మృతి చెందాడు. తుగ్గలి మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన పెద్దులు, సయ్యద్ ఖాసీం ఇద్దరూ స్కూటీపై పట్టణంలో ఓ వివాహ కార్యక్రమానికి బయల్దేరారు. గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు వద్ద స్కూటీని రోడ్డు పక్కన ఆపు తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈప్రమాదంలో సయ్యద్ ఖాసీం లారీ వెనుక టైరు కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పెద్దులు స్వల్పంగా గాయపడ్డాడు. సీఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చిన్నముష్టూరు వద్ద గుర్తు తెలియని వ్యక్తి...

ఉరవకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని 55 నుంచి 60 సంవత్సరాలు గల ఓ వ్యక్తి మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో వ్యక్తిని గుర్తించలేని పరిస్థితి ఉంది. మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహంపై నీలిరంగు చొక్కా, నీలి రంగు ప్యాంటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వీఆర్ఏ ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలూరు రోడ్డులో నివాసముంటున్న కర్నూలు జిల్లా తుగ్గలి వీఆర్ఏ రామాంజనేయులు ఇంట్లో చోరీ జరిగింది. రామాంజనేయులు భార్య సులోచన 15 రోజుల కిందట మరణించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటికి తాళం వేసి పట్టణంలోని ఆరోగ్య మాత పుణ్యక్షేత్రంలో నిద్ర చేయడానికి వీఆర్ఏ వెళ్లాడు. దీన్ని గమనించిన దుండగులు రాత్రి అతడి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 15 తులాల బంగారు నగలు, రూ. 1.3 లక్షలు చోరీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన వీఆర్ఏ చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుడి చీనీ చెట్లు ధ్వంసం


ధ్వంసం చేసిన చీనీచెట్లు

పుట్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు నారాయణరెడ్డికి చెందిన రెండేళ్ల వయస్సు ఉన్న చీనీచెట్లను గురువారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మూడు ఎకరాల్లో 350 చీనీ చెట్లను సాగు చేస్తుండగా వాటిలో 25 చెట్లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఉదయం తోటకు వెళ్లిన నారాయణరెడ్డి ధ్వంసమైన చీనీచెట్లను గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలాన్ని సీఐ సత్యబాబు పరిశీలించి డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సుదర్శన్‌నాయుడు, రామాంజనేయులు, సుబ్బారెడ్డి, రవీంద్రచౌదరి, దస్తగిరి, పెద్దిరాజు రైతును పరామర్శించారు.

చనిపోతున్నానంటూ సెల్ఫీ వీడియో

- పురుగుల మందు తాగిన టిప్పర్ డ్రైవర్
- యజమాని కుమారుడి తీరుతో మనస్తాపం చెందినట్లు ఆవేదన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఇద్దరిపై కేసు నమోదు


ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వీడియో పెట్టిన హుస్సేన్

యాడికి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తాను గతంలో పనిచేసిన టిప్పర్ యజమాని కొడుకు డబ్బు విషయంలో కొట్టి అవమానించాడనీ, దీంతో చనిపోతున్నానంటూ మండలంలోని చందన గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ హుస్సేన్ విషద్రావకం తాగాడు. దానిని సెల్ఫీ వీడియో తీశాడు. విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హుస్సేన్ సోషల్ మీడియాలో పెట్టిన వీడియో మేరకు వివరాలిలా ఉన్నాయి. హుస్సేన్ గతంలో రాయలచెరువుకు చెందిన పారిశ్రామికవేత్త టిప్పర్‌కు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆ సమయంలో అడ్వాన్సుగా యజమాని నుంచి రూ.30వేలు తీసుకున్నాడు. ఇటీవల అతడి వద్ద పని మానేసి, మరొకరి వద్ద డ్రైవర్‌గా చేరాడు. విషయం తెలుసుకున్న పాత యజమాని కుమారుడు ఈనెల 18న రాయలచెరువులో ఉన్న హుస్సేన్ వద్దకెళ్లి ఇంటివద్దకు రావాలనీ, మాట్లాడాలని చెప్పినట్లు తెలిపాడు. ఇదే క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి యజమాని కొడుకు.. హుస్సేన్‌ను కొట్టినట్లు వాపోయాడు. యజమాని ఇచ్చిన రూ.30వేలు తిరిగి ఇచ్చినా.. ఇవ్వలేదనడం బాధేసిందని వీడియోలో ఆవేదన చెందాడు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు తెలిపాడు. విషద్రావకం తాగి స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో వారు హుస్సేన్‌ను రాయలచెరువు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుత్తికి తీసుకెళ్లారు. హుస్సేన్ తాను చనిపోతున్నానంటూ తీసుకున్న సెల్ఫీవీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. హుస్సేన్ ఆత్మహత్యాయత్నానికి సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డీఆర్వోకు స్పెషల్ గ్రేడ్ ప్రమోషన్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)మలోలకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఇదివరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆయనకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా లభించింది. దీంతో ఆయన్ను గురువారం అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

కడప, నెల్లూరు జట్ల శుభారంభం

- ఏసీఏ సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభం


రేవంత్‌రెడ్డి, భరత్ వంశీకృష్ణ, అర్జున్ టెండూల్కర్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీ20 పోటీల్లో కడప, నెల్లూరు జట్లు శుభారంభం చేశాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)ఆధ్వర్యంలో గురువారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. తొలుత కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 210పరుగులు చేసింది. వంశీకృష్ణ 61బంతుల్లో 10బౌండరీలు, నాలుగు సిక్సర్లతో 98పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ జహీర్ అబ్బాస్ 64పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 165పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. కడప బౌలర్లు అరీఫ్ బాషా 3, ధ్రువకుమార్ రెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 19.4ఓవర్లలో 158పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 78పరుగులతో జిల్లాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. కడప 18.5ఓవర్లలోనే 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటర్ రేవంత్‌రెడ్డి 86పరుగులు, ఫర్హాద్ ఖాద్రి 56 పరుగులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ అవసరం

- కేంద్ర కమిటీ సభ్యులకు ఇరిగేషన్ అధికారుల నివేదన
- పీఏబీఆర్‌ను పరిశీలించిన కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ
- జిల్లాలో పలు ప్రాంతాల్లో వాటర్‌షెడ్, ఉపాధి పనుల పరిశీలన
- క్షేత్రస్థాయిలో రైతులతో మాటామంతీ

కూడేరు/కళ్యాణదుర్గం/అనంతపురం అర్బన్/యల్లనూరు/రాయదుర్గం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో 11.1 టీఎంసీల నీరు నిల్వ చేయడానికి భూ సేకరణ అవసరమని కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ సభ్యులకు స్థానిక ఇరిగేషన్ అధికారులు నివేదించారు. మండలంలోని పీఏబీఆర్ డ్యాంను కేంద్ర కమిటీ సభ్యులు గౌతమ్, శంకర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పీఏబీఆర్ డ్యాం గురించి అధికారులతో ఆరా తీశారు. ప్రస్తుతం డ్యాంలో 2.300 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. ప్రతి ఏడాది 5 టీఎంసీల వరకు తీసుకొని, కుడికాలువకు కింద ఉన్న చెరువులకు అందిస్తామన్నారు. ఈ డ్యాం ద్వారా జలవిద్యుత్ ఉత్పత్తితోపాటు, నాలుగు ప్రాజెక్టులకు నీటిని సరఫరా చేస్తున్నట్లల వివరించారు. అయితే 11.1 టీఎంసీల నీల్వ సామర్థ్యంతో డ్యాంను నిర్మించారని, అందుకు అవసరమైన భూ సేకరణ జరగాల్సి ఉందని డ్యాం ఈఈ శశిరేఖ వివరించారు. డ్యాంకు అక్కడక్కడ లీకేజీలు ఉన్నాయని, నిధులు కేటాయిస్తే త్వరగా పనులు చేయవచ్చన్నారు. డ్యాంలో పూర్తి స్థాయి నీరు నిల్వ చేస్తే కుడికాలువ కిందనున్న 49 చెరువులకు నీరు అందించి, 40 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. వీటన్నింటి కోసం రూ.550 కోట్ల నిధులు అవసరమని తెలియజేశారు. కాగా కేంద్ర బృందం సభ్యులు ముందుగా కూడేరులోని సబ్ స్టేషన్ ఆవరణలోని పీజోమీటర్ ద్వారా భూగర్భజల మట్టాన్ని పరిశీలించారు. అనంతరం పీఏబీఆర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డ్వామా వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్ రెడ్డి, డీఈలు వెంకటరమణ, ఉదయశేషయ్య, ఏఈలు రామకృష్ణ, ముత్యాలప్ప, లక్ష్మీనరసింహశాస్త్రి, వెంకటరమణ, గంగమ్మ, లక్ష్మీదేవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన

కళ్యాణదుర్గం మండలంలోని గోళ్ల పంచాయతీ పరిధిలో జరిగిన మైక్రో వాటర్ షెడ్ పనులను కేంద్ర బృందం సభ్యులు శంకర్, గౌతమ్ గురువారం పరిశీలించారు. రాతి చప్టాల్లు, పాంపాండ్లు, ఊటకుంట పనులను పరిశీలించారు. వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇంకా ఏయే పనులు చేస్తున్నారని అధికారులతో అడిగి తెలుసుకున్నారు. తర్వాత అక్కడి నుంచి రాయదుర్గం మండలం వీరాపురంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ట్రెంచ్ పనులు, మొక్కల పెంపకాన్ని బృందం సభ్యులు పరిశీలించారు.


పీఏబీఆర్ డ్యాంను పరిశీలించిన కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ సభ్యులు


కళ్యాణదుర్గం మండలం గోళ్లలో రాతికట్టడాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

యల్లనూరు మండలంలో ఉపాధి పనులు...

యల్లనూరు మండలంలో ఉపాధి పథకం ద్వారా జరిగిన పనులను కేంద్రబృందం గురువారం పరిశీలించింది. చింతకాయమంద, మల్లాగుండ్ల పంచాయతీల్లో సుమారు రూ.ఏడు కోట్లతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. అనంతరం గడ్డంవారిపల్లి పంచాయతీలో ఉపాధి పనుల ద్వారా నిర్మించిన మట్టిరోడ్డు, నీటితొట్లను పరిశీలించారు. వారి వెంట ఉపాధిపథకం సెంట్రల్ పీఓ నభనీస్‌దాస్, నాబార్డ్ కన్సల్టేషన్ అధికారి వెంకటేశ్వరన్, జిల్లా డ్వామా అధికారు, ఉపాధి పథకం కమిషనర్ శివప్రసాద్, పీడీ సలాం, ఏపీడీ పుల్లారెడ్డి ఉన్నారు.

నీటితొట్టెలు ఉపయోగపడుతున్నాయా..?

జిల్లాలో ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన పశువుల నీటితొట్టెలు ఉపయోగపడుతున్నాయా ? అని యల్లనూరు మండలం తిమ్మంపల్లి రైతులను కేంద్ర కమిటీ బృందం సభ్యులు నవనీతదాస్, వెంకటేశ్వరన్ ప్రశ్నించారు. డ్వామా పీడీ సలీం బాషాతో కలిసి ఉపాధి నిధులతో చేపట్టిన పలు రకాల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనుల వివరాలను డ్వామా పీడీ సలీం బాషా బృందం సభ్యులకు వివరించారు. తిమ్మంపల్లిలో పశువుల నీటి తొట్టెలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తర్వాత తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లిలో అటవీ శాఖ నర్సరీని పరిశీలించారు.

గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి 25న పరీక్ష

అనంతపురంవిద్య, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతివరకు మిగిలిన సీట్లకు ఈనెల25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి జయలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతపురం జిల్లాలో సీట్లు ఖాళీ లేవన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కాళసముద్రం బీసీ-1, మలుగూరు ఎస్సీ గ్రూపు 3లో 02, నల్లమాడలో ఎస్సీగ్రూపు-3లో 2, ఎస్టీ2, ఓసీ1, అమరాపురంలో ఎస్సీగ్రూపు-3లో 1, రొళ్లలో ఎస్సీగ్రూపు3-లో 2, ఓసీ 1 చొప్పున ఆరో తరగతిలో సీట్లు ఉన్నాయన్నారు. మలుగూరులో ఎస్సీ గ్రూపు-3లో 1, అమరాపురంలో ఎస్సీ గ్రూపు-3లో 1, హిందూపురం బాలికలలో ఎస్సీ గ్రూపు-3లో 3, ఎస్టీ 1, బీసీ 1, రొళ్ల ఎస్టీ 1 చొప్పున ఏడో తరగతిలో సీట్లు ఉన్నాయన్నారు. తొమ్మిదో తరగతిలో హిందూపురం బాలికలలో ఎస్సీ గ్రూపు-3లో ఒకటి ఖాళీ ఉందన్నారు. 8వ తరగతిలో ఎక్కడా సీట్లు ఖాళీలు లేవని అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి జయలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు.

వైద్యశాఖలో బదిలీల గోల

(3వ పేజీ తరువాయి)

తలెత్తుతున్నాయి. మినహాంపులు వర్తించేవారిలో అత్యధికంగా స్టాఫ్ నర్సులు ఉన్నారు. జోన్ పరిధిలో 163 మంది స్టాఫ్ నర్సులు ఉండగా.. అనంతపురం నుంచి కర్నూలు, కర్నూలు నుంచి అనంతపురం వచ్చేందుకు ఎక్కువగా పోటీ పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి కౌన్సెలింగ్ జరుగుతోంది. ఎప్పటికి పూర్తవుతుందో అధికారులు చెప్పలేకున్నారని స్టాఫ్‌నర్సులు అంటున్నారు.

బదిలీ ఉత్తర్వుల జారీ

ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ), ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్), సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్(ఎస్ఎస్‌హెచ్), ప్రాథమిక వైద్య కేంద్రాలలో(పీహెచ్‌సీ) పనిచేస్తున్న జోనల్ కేడర్ల ఉద్యోగుల బదిలీల ప్రక్రియను రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య కొనసాగిస్తున్నారు. కార్యాలయాల సూపరింటెండెంట్, ఫార్మసీ ఆఫీసర్, హెల్త్ ఎడ్యుకేటర్, రేడియోగ్రాఫర్, డీపీఎంఓ, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, పీఎంఓఏ, హెడ్‌నర్స్ కేడర్లలో ఐదు సంవత్సరాలు ఒకేచోట పనిచేసిన వారిని బదిలీచేశారు. కొన్ని మినాహాయింపుల కింద అదేస్థానంలో కొనసాగేలా నిలుపుదల చేశారు. రేడియోగ్రాఫర్ కేడర్‌లో జీజీహెచ్‌లోని సాలివన్ సింగ్‌ను ఇక్కడే ఉంచారు. తిరుపతి నుంచి జీఎంసీకి సరేంద్ర బదిలీ అయ్యారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా(డీపీఎంఓ) యర్రగుంట్ల నుంచి బెళుగుప్ప పీహెచ్‌సీకి నీలకంఠ, కొడికొండ నుంచి అనంతపురం అర్బన్‌కు తిప్పేస్వామి, కర్నూలు జిల్లా పగిడిరాయి నుంచి కొనకొండ్లకు మరియాదాస్‌ను బదిలీ చేస్తూ ఉత్తరులుఉ ఇచ్చారు. అనంతపురం జీజీహెచ్‌లో పనిచేస్తున్న సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ సోమశేఖర్‌ను కర్నూలు జీజీహెచ్‌కు, నర్స్ ఆఫ్ హెచ్‌ఈ కేడర్ నిర్మలాబాయిని నంద్యాల నుంచి అనంతపురం జీజీహెచ్‌కు బదిలీచేశారు. వీరితోపాటు ఆరుగురు కార్యాలయాల సూపరింటెండెంట్‌లు, 14మంది ఫార్మసీ ఆఫీసర్లు, ఐదుగురు చొప్పున హెల్త్ ఎడ్యుకేటర్లు, పారామెడికల్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న 19మంది హెడ్ నర్సులు కూడా బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో 56 మందికి గురువారం ఆర్డీ బదిలీ ఉత్తర్వులు జారీచేశారు.

కార్యాలయాల సూపరింటెండెంట్ క్యాడర్ బదిలీలు.

ఉద్యోగి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
శ్రీనివాసకుమార్	డీఎంహెచ్ఓ ఆఫీస్	వైద్యకళాశాల, కర్నూలు
రమణ	జీజీహెచ్	దంత వైద్య కళాశాల, కడప
హరిశకంర్‌రావ్	వైద్య కళాశాల	వైద్యకళాశాల, కర్నూలు
షర్మిల	వైద్య కళాశాల	రిటెన్షన్
శ్రీలత	డీఎంహెచ్ఓ ఆఫీస్	రిటెన్షన్
విజయబాస్కర్‌రెడ్డి	డీఎంహెచ్ఓ ఆఫీస్	మలేరియా ఆఫీసర్, కడప

ఫార్మసీ ఆఫీసర్ క్యాడర్ బదిలీలు.....

వేణుగోపాల్	యూనిట్ హాస్పిటల్	ఆత్మకూరు
మాధవ	ముద్దినాయనపల్లి	పీటీసీ యూనిట్ హాస్పిటల్
సురేంద్రనాథ్	కల్లూరు	కన్నూరు, కడప
నాగవేణి	పుట్టపర్తి	వెంగలమ్మచెరువు
జయలక్ష్మి	ఎద్దులపల్లి	క్రిష్ణపాడు
స్వర్ణకుమారి	పట్నం	రెడ్డిపల్లి
శంకర్‌నాయక్	వెంగలమ్మచెరువు	పుట్టపర్తి
ఓబులేసు	తొండూరు, కడప జిల్లా	బుక్కపట్నం
కేఎండీ ఇంతేఖాన్	బుక్కపట్నం	ఎద్దులపల్లి
సునీల్‌కుమార్	క్రిష్ణపాడు	నల్లచెరువు
జయప్రకాస్	రెడ్డిపల్లి	నల్లచెరువు
అనురాధ	యర్రగుంట్ల	ముడిపాపనపల్లి, చిత్తూరుజిల్లా
చిన్నయ్యశెటి	నల్లచెరువు	పట్నం
రామచంద్రనాయక్	నాగసముద్రం	వజ్రకరూరు

హెల్త్ ఎడ్యుకేటర్ కేడర్ బదిలీలు....

లక్ష్మీనారాయణ	డి.హీరేహాళ్	ఆఫీస్ బేరర్
సుబ్రమణ్యం	పెద్దపప్పూరు	పెద్దపప్పూరు (రిటెన్షన్)
రుక్మిణి	మల్లనూర్, చిత్తూరు జిల్లా	శ్రీధరఘట్ట
విజయబాస్కర్	క్రిష్ణపాడు	క్రిష్ణపాడు (రిటెన్షన్)
ఫాతిమున్నీసాబీ	వైద్యకళాశాల	వైద్యకళాశాల (రి)

పారామెడికల్ ఆఫీసర్ కేడర్ బదిలీలు

ఉరుకుందప్ప	తాడిమర్రి	ఆఫీస్ బేరర్ (రిటెన్షన్)
శ్రీనివాసులు	పెనుకొండ	ఆఫీస్ బేరర్ (రిటెన్షన్)
హుస్సేన్	యర్రగుంట్ల	తరిమెల
రామమోహన్‌రెడ్డి	బుక్కపట్నం	రిటెన్షన్
హరిప్రసాద్	ఐరాల	తిమ్మంపల్లి

హెడ్ నర్స్ కేడర్ బదిలీలు....

భానులత	అనంతపురం	ఆఫీస్ బేరర్ (రిటెన్షన్)
మహాలక్ష్మి	అనంతపురం	ఆర్‌హెచ్‌సీ, ఆత్మకూరు
మరియమ్మ	అనంతపురం	ఎస్ఎస్ఎస్‌హెచ్, కడప
సుభాషిణి	కర్నూలు	అనంతపురం
ఆశాలత	అనంతపురం	రిటెన్షన్
జరీనా పర్వీన్	అనంతపురం	కర్నూలు
సుగుణావతమ్మ	కర్నూలు	అనంతపురం
ఉమాదేవి	కర్నూలు	అనంతపురం
నిర్మల	అనంతపురం	కర్నూలు
పద్మజ	అనంతపురం	కర్నూలు
శాంత	అనంతపురం	తిరుపతి
జమీలాబీ	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
దుర్గాంబ	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
నిర్మలా కుమారి	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
ఆదిలక్ష్మి	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
బాలతులసమ్మ	అనంతపురం	రిటెన్షన్
వనజ	అనంతపురం	రిటెన్షన్
జ్యోతి రోజామణి	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
ఉమాదేవి	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- రేపట్నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 25 నుంచి ఆన్‌లైన్‌లో కళాశాలల ఎంపిక

అనంతపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభంకానుంది. గురువారం అందుకు సంబంధించిన వివరాలను అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి వెల్లడించారు. శుక్రవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు రూ. 250 చెల్లించాల్సి ఉం టుందన్నారు. 21 నుంచి 28వ తేదీ వరకు ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యార్థులు సమీప కళాశాలల్లో కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చన్నారు. జూన్ 25 నుంచి 30వతేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ చేపడతామన్నారు. జూలై 4 నుంచి సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. స్పోర్ట్స్ కేటగిరీ విద్యార్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. 25 నుంచి 28వ తేదీ వరకు ఎన్‌సీసీ, పీడబ్ల్యూడీ, స్పోర్ట్, సీఏపీ, స్కౌట్స్, గైడ్స్, తదితర విద్యార్థులు కేటాయించిన కౌన్సెలింగ్ తేదీల్లో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ నంబరు 63055 10654, కళ్యాణదుర్గం 9505504207, తాడిపత్రి 7901620198, హిందూపురం 8297525703 నంబర్లలో సంప్రందించవచ్చని ప్రిన్సిపాల్ వివరించారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ తేదీలు ఇవీ..

తేదీ	ర్యాంకు నుంచి..	ర్యాంకు వరకు..
21	1	15,000
22	15,001	32,000
23	32,001	50,000
24	50,001	68,000
25	68,001	86,000
26	86,001	1,04,000
27	1,04,001	1,20,000
28	1,20,001	చివరి ర్యాంకు వరకు..


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయ చంద్రారెడ్డి

ఇక ఎంటీఎస్ టీచర్ల వంతు

- మిగిలిన ఖాళీలకే సర్దుబాటు ● నిబంధనలపై పలువురి ఆవేదన

అనంతపురం విద్య, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ టీచర్ల బదిలీలు ముగియడంతో ఇక మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉద్యోగుల వంతు మొదలైంది. ఇపుడు ఎంటీఎస్ టీచర్లను ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు సర్దుబాటు చేయడానికి నిర్ణయం తీసుకు న్నారు. ఈమేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో జిల్లాలో ఎంటీఎస్ టీచర్ల బదిలీల సర్దుబాటుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. జిల్లాలో 590మంది వరకు ఎంటీఎస్ టీచర్లు ఉన్నారు. ఇందులో డీఎస్సీ-2008 వారు 180మంది ఉండగా, డీఎస్సీ-1998 వారు 414మంది ఉన్నారు. వీరందరిని సర్దుబాటు చేయనున్నారు.

దూరంగా ఉన్న మండలాలకే..?

ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటుకు రాష్ట్ర కమిషనర్ నిబంధనలు విడుదల చేశారు. ఇందులో తొలుత ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలకు వీరిని కేటాయించాలి. ఆతర్వాత ఒక్క టీచర్ ఉన్న పాఠశాలకు పంపించాలి. అనంతరం నిబంధనల మేరకు ఉండాల్సిన టీచర్లకంటే తక్కువ టీచర్లు ఉన్న స్కూళ్లకు ఎంటీఎస్ టీచర్లను సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇటీవల రెగ్యులర్ టీచర్ల బదిలీలు జరిగాయి. నగర, పట్టణ, మండల సమీపంలో ఉన్న అన్ని పాఠశాలలకు టీచర్లు వచ్చేశారు. ఈపరిస్థితులలో ఉమ్మడి జిల్లాలోని దూర ప్రాంతాలలోని పాఠశాలల్లోనే టీచర్ల పోస్టులు అధికంగా ఖాళీగా కనిపిస్తున్నాయి. నిబంధనల మేరకు ఎంటీఎస్ టీచర్లు 75శాతం మంది మారుమూల ప్రాంతాల పాఠశాలలకే వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎంటీఎస్ టీచర్లు తీవ్ర ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర్వులు వచ్చాయి: ప్రసాద్‌బాబు, డీఈఓ

ఎంటీఎస్ టీచర్లను సర్దుబాటు చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. శుక్రవారమే కౌన్సెలింగ్ నిర్వహించాలనికూడా చెప్పారు. ఇప్పటికే ఎంటీఎస్ టీచర్ల సీనియారిటీ జాబితాను ఇచ్చాం. అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేస్తే సవరిస్తాం, ఆతర్వాతనే కమిషనర్ ఇచ్చిన నిబంధనలకు అనుగుణంగా సర్దుబాటులో పోస్టింగ్‌లు ఇస్తాం.

కోర్టు వాయిదాకు టీడీపీ నేతల హాజరు

అనంతపురం క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం కక్ష సాధింపుతో అక్రమంగా పెట్టిన కేసులో కోర్టు వాయిదాకు ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. 2023లో నారా భువనేశ్వరిపై వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు అనంతపురంలోని రవి పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం.. వారిపై అక్రమ కేసులు బనాయించింది. ఆ కేసుకు సంబంధించి కోర్టు వాయిదాకు గురువారం విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు శ్రీధర్ చౌదరి, ఆదినారాయణ మరో 20 మంది వరకూ హాజరయ్యారు. విచారణను కోర్టు ఈనెల 26వ తేదీకి వాయిదా వేసింది. కార్యక్రమంలో న్యాయవాదులు గాజుల ఆదెన్న, తిరుమల నాయడు, లేపాక్షినాయుడు, బుడేన్ సాబ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు క్లర్క్ మృతి

శెట్టూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిగొల్లపల్లి సమీపాన బైక్‌లు ఢీకొని ములకలేడు యూనియన్ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న క్లర్క్ పార్థసారథి (53) దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లికి చెందిన పార్థసారథి ములకలేడులో పనిచేస్తుండేవారు. కళ్యాణదుర్గంలో నివాసముండేవారు. గురువారం విధులకు హాజరయ్యేందుకు కళ్యాణదుర్గం నుంచి ములకలేడుకు బయల్దేరారు. అడవిగొల్లపల్లి సమీపాన గాలిమర వద్ద శెట్టూరు మండలం కనుకూరు గ్రామానికి చెందిన సత్యనారాయణ తన కూతురిని పాఠశాలకు వదిలేందుకు కళ్యాణదుర్గం వైపు వెళ్తూ ఢీకొట్టారు. దీంతో పార్థసారథి అక్కడికక్కడే మరణించాడు. సత్యనారాయణకు గాయాలవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. పార్థసారథికి భార్య నాగలక్ష్మి, కుమార్తె శివగంగ ఉన్నారు.

న్యూస్ బాక్స్

యోగా దినోత్సవానికి తరలిరండి

ధర్మవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నిర్వహించే యోగా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6-30 నుంచి 7-30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

బత్తలపల్లి జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ధర్మవరం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి జనార్దన్‌రావు గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ధర్మవరం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారిగా జనార్దనరావు బాధ్యతలు తీసుకున్న తరువాత మెదటిసారి బత్తలపల్లికి రావడంతో కార్యాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏఓ శ్రీనివాసులు, పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపునకు నిధులు

కొత్తచెరువు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం చెరువుకట్ట కు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను(జంగిల్ క్లీనింగ్) తొలగించ డానికి ప్రభుత్వం రూ.12.60 లక్షలు నిధులు మంజూరు చేసిందని చెరువు సంఘం అధ్యక్షుడు పీవీ నవీన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జంగిల్ క్లీనింగ్ పనులను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చేతులుమీదుగా శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు.

వేరుశనగకు ప్రత్యామ్నాయం ఆముదం

●వ్యవసాయ శాస్త్రవేత్త

కదిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఆముదం సాగుచేస్తే రైతులు లాభాల బాట పట్టవచ్చని రేకులకుంట వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు పేర్కొన్నారు. కదిరి వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఔత్సహిక రైతులకు ఐసీహెచ్-5 రకం ఆము దం విత్తనాలు అందించారు. ఐసీహెచ్ -5 ఆముదం విత్తనాల గురించి సమగ్ర యజమాన్యం గురించి డాక్టర్ ఆర్ నసీరుద్దీన్, కదిరి ఏడీ, శాస్త్రవేత్తలు మాధవిలత, నరసింహులు, రమేష్‌నాయక్ వివరించారు. కార్యక్రమంలో రైతులున్నారు.

'ప్రమాదాలను నివారించండి'

ముదిగుబ్బ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న 342వ జాతీయ రహదారిపై పొడరాళ్ళపల్లి సమీపంలోని కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని జాతీయ మానవ హక్కు ల దక్షిణ రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు వెంగమేష్ చౌదరి అన్నారు. వాటిని నివారించాలన్నారు. ఆయన గురువారం ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. గతంలో ప్రమాదాల గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ స్థలాల్లో సూచికలు ఏర్పాటు చేయించామన్నారు. అయినా ఇంకా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత జిల్లా అధికారులు ఈ డేంజర్ జోన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి శాశ్వత పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాస్పత్రికి సామగ్రి వితరణ



కంటి విభాగం మెటీరియల్ అందజేస్తున్న డాక్టర్ సోనియా

ధర్మవరం, జూన్19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ప్రభుత్వాస్పత్రికి స్పందన ఆస్పత్రి వైద్యులు సోనియా కంటి విభాగానికి సంబంధించిన మెటీరియల్‌ను వితరణ చేశారు. కంటి విభాగానికి సంబంధించి రూ.40వేలు విలువ చేసే సామగ్రిని గురువారం స్థానిక ప్రభుత్వాస్ప త్రిలో సూపరింటెండెంట్ మాధవికి అందజేశారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ నజీర్, రాముడు, హరిశ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఏఓ ఉదయ్‌భాస్కర్, స్పందన ఆస్పత్రి సిబ్బంది బాబాఫక్రుద్దీన్, దిల్‌దార్ పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ధర్మవరం/కదిరి అర్బన్/నల్లమాడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జాతీయ ముఖ్యనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేశ్ తదితరులు గురువారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి, వేడుకలను జరుకున్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు. అలాగే కదిరి రూరల్ మండలంలోని మొటుకుపల్లి వద్ద ఉన్న ఆర్డీటీ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలమత్తూరు మోహన్ గాంధీ ఆధ్వర్యంలో, మండలకేం ద్రమైన నల్లమాడలో కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గౌస్‌బాషా నివాసంలో కేక్‌ను కట్ చేశారు.

వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): భర్త కుమార్ తరచూ వేధిస్తున్నాడంటూ కుంచపు మాధవి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన కుమార్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, దీంతో తనను తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడని మాధవి గురువారం ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

భూవివాదం కేసులో ఆరుగురి అరెస్ట్

కొత్తచెరువు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధర్మవరం ప్రదాన రహదారి పక్కన 446 సర్వే నుంబరులో 7.65 ఎకరాల భూ వివాదంలో జరిగిన గొడవలకు సంబంధించి నమో దైన కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్టు సీఐ మారుతీ శంకర్ తెలిపారు. గ్రామానికి చంఎదిన దాల్‌మిల్ సూరి, అనంతపురానికి చెందిన సుశీలమ్మ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సుశీలమ్మ, ఆమె కుమారుడు సాగర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులు విజయ్‌కుమార్, ఫణిశేఖర్, ఆవుల అశోక్, నీరుగంటి నరేశ్, మాసపల్లి అశోక్, మొరిమిశెట్టి హేమంత్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముదిగుబ్బ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలపరిధిలోని మొగలిచెట్లపల్లికి చెందిన వరదప్ప (40) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ముదిగుబ్బ పోలీసులు పేర్కొన్నారు. మొగలిచెట్లపల్లికి చెందిన వెంకటప్ప కుమారుడు వరదప్ప(40) ఈనెల 12వ తేదీ స్వగ్రామంలో వ్యవసాయ పనులు ముగించుకొని ద్విచక్రవాహనంలో ముదిగుబ్బకు వెళుతున్నాడు. ఇందుకూరు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బత్తలప ల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంత పురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికి త్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య మ ల్లిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముదిగుబ్బ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

స్వచ్ఛతలేని కార్యాలయం

● ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిన ఆవరణం



ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

నల్లమాడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివాస్ పేరుతో ప్రతి కార్యాలయంలో అధికారులు తు.చ. పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలోని ఎంపీడీ ఓ కార్యాలయం ఆవరణంలో అధికారులు పరిశుభ్రతను పట్టించుకున్నట్లు లేదు. ఆ ఆవరణలో పలు శాఖల కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది. మోకాళ్ల ఎత్తులో ఉన్న వాటిలో విషపురులు సంచారం ఎక్కువగా ఉంది. అధికారులు కూడా ఒకటి, రెండుమార్లు విషపురుగులను చూశారు. అలాగే రెండుమూడుమార్లు కార్యాలయ ఆవరణతోపాటు కార్యాలయాల్లోనే విషపురుగులు కనిపించాయి. అయినా అక్కడి అధికారులు కార్యాలయాల చుట్టూ ఉన్న గడ్డిని తొలగించడంపై ఆసక్తి చూపలేదు. ఏదో ఒక పాఠశాల కో, ఏదో ఒక కార్యాలయానికి వెళ్లి స్వచ్ఛ దివాస్ కార్యక్రమం చేపట్టినట్లు ఫొటోలకు ఫోజులిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో వెలుగు కార్యాలయం, సచివాలయం, రెండు రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ శా ఖ, హౌసింగ్, విద్యాశాఖ కార్యాలయాలున్నాయి. అందరూ మండల శాఖాధికారులే. అయినా స్వచ్ఛదివాస్ కార్యక్రమం చేపట్టి ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించలేదని ప్రజలు చర్చించు కుంటున్నారు. రాత్రి 7గంటలు దాటితే కార్యాలయం ఆవరణంలోకి వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇది ఇలా ఉండగా బాల్యవివాహాలపై గత నెలక్రితం ఎస్పీ రత్న సమావేశం నిర్వహించారు. రాత్రి 7గంటల సమయంలో ఆ సమావేశంలో మహిళలు పాల్గొన్నారు. ఆ సమయంలో చివరి వైపున ఓ పాము దర్శనమివ్వడంతో మహిళలు పరుగులు తీశారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

● 'మన ఇంటికి మన ఎమ్మెల్యే'లో ఎమ్మెల్యే కందికుంట



మల్లమీదపల్లిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

గాండ్లపెంట, జూన్19(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు మనింటికి మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలోని కరణవారిపల్లిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలోఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యలను ఆయా శాఖాధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఇంటిలో చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం, వృద్ధుల పింఛన్లు తదితర వాటిపై ఆరాతీశారు. రైతులు సాగుచేసిన బీర తోట వద్దకెళ్లి కూలీల సమస్యలపై విచారించారు. వృద్ధులకు పింఛన్లు నెలల పంపిణీ తీరుపై ఆరాతీశారు. వివిధ శాఖల పనితీరుపై ప్రజలతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, అన్నిశాఖల అధికారులు, టీడీపీ మండలకన్వీనర్ కొండయ్య, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, జనసేన పార్టీ సత్యవతమ్మ, మాజీ సర్పంచ్ గొడ్డివెలగల ప్రసాద్, గంగరాజు, శ్రీరాములు, వెంకటరమణ, వెంకటనారాయణ, గంగాద్రి, ఈశ్వర్‌రెడ్డి, మోహన్, భాస్కర్, రామాంజులు, సర్పంచ్ శివప్పనాయుడు, అక్రమ్ బాషా, తుంగా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రారంభం

మల్లమీదపల్లి పంచాయతీలో నిర్మించిన మోడల్ స్కూల్‌ను గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లమీదపల్లిలో 1నుంచి 5వ తరగతి వరకు ఒక మోడల్ స్కూల్, అలాగే 6నుంచి 10వ తరగతి వరకు మరో మోడల్ స్కూల్ ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందుతుందన్నారు. ఎంఈఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనాగరిక సంస్కృతిని విడనాడండి

● మాజీ సీఎం జగన్‌కు ఎమ్మెల్యే హితవు

● గాండ్లపెంట: అనాగరిక సంస్కృతిని విడనాడాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హితవు పలికారు. గురువారం మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలోని కోటూరులో నిర్వహించిన మనింటికి మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలు దశలవారీగా నేరవేరుస్తోందన్నారు. ప్రస్తుతం తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పేరు మీద డబ్బు జమ చేశామన్నారు. ఇంది చూసి ఓర్వలేని వైసీపీ వారు ఎన్నో అనాగరిక మాటలు మాట్లడడంతో పాటు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి 11ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి ప్రజలు మంచి గుణపాఠం చెప్పారన్నారు. అయినా వారు మారలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే గంగమ్మకు మేకపోతులను బలిచ్చినట్లూ చేస్తామని అనుచిత వ్యాఖ్యలు చయడం సరికాదన్నారు. అది అనాగరిక సంస్కృతికి దారి తీస్తుందన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే కమిటీల ఎంపిక

● టీడీపీ మండల పరిశీలకుడు

ధర్మవరం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కమిటీల ఎంపికలో ప్రతి కార్యకర్త కుటుంబ సాధికారిక సారథి అభిప్రాయాలను పరిగణలోకి తీసు కుంటామని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ ధర్మవరం మండల అబ్జర్వర్ బేకరి గంగాధర్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు టీడీపీ స్థానిక కార్యాలయంలో పార్టీ కమిటీల ఎన్నిక ప్రక్రియపై మం డల, గ్రామస్థాయి నాయకులతో గురవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని విభాగాల పదవులకు వచ్చిన నామినేషన్‌లను నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ద్వారా జిల్లా కమిటికి పంపుతామన్నారు. అక్కడి నుంచి రాష్ట్ర పార్టీకి పంపు తారన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్, మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, ప్రధానకార్యదర్శి విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

'క్రమశిక్షణ గల పార్టీ టీడీపీ'

● నంబులపూలకుంట: క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ కలిగిన పార్టీ టీడీపీ అని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటరమణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని మల్లికార్జునస్వామి కమ్యూనిటీ భవనంలో గురు వారం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ దండేరవి, మండల, గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులున్నారు.

టీడీపీ గ్రామ కమిటీ ఎంపిక

తనకల్లు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంమైన తనకల్లు పంచాయతీ తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తనకల్లు చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో పార్టీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సమావేశమయ్యారు. మేజర్ పంచాయతీ అధ్యక్షుడిగా రెడ్డివారిపల్లికి చెందిన దేశాయి హరి నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా దారం సుధాకర్ ఉస్తిలిపల్లి, ప్రధాన కార్య దర్శిగా శ్రీనివాసులు, రామాంజులరెడ్డి, కోశాధికారి నగేష్ బాబు, ఓబు లేసును ఎంపిక చేశారు. అలాగే కార్యనిర్వాహక కార్యదర్శులుగా ప్రసాద్, సుధాకర్, మస్తాన్, శంకర్, గౌస్‌బాషా, రమణ, ఇందిరమ్మ, బులేనాయక్ ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో దేశాయి విదుర శేఖర్‌రెడ్డి, బీగం శంకర్‌నాయుడు తోట సరోజమ్మ, మహబూబ్‌బాషా, పీజీ మల్లికార్జున, రెడ్డిఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీసీలకు డబ్బు అడుగుతున్నారు: పీఎస్‌యూ

ధర్మవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పాసైన విద్యార్థులకు టీసీలు ఇవ్వడానికి కొన్న ప్రభుత్వ పాఠశాలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని పీఎస్‌యూ నాయకులు ఆరోపిం చారు. ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మొండి నందకిశోర్ తదితరులు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కార్యాలయ అధికారి సుజాతకు వినతిపత్రం అందజేశారు.

ఆక్రమణల తొలగింపునకు పలువురి విముఖత



అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగిస్తున్న యజమానులు

కొత్తచెరువు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో రహదారులకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాలలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కొంతమంది స్వచ్ఛందంగా తొలగించు కుంటున్నారు. మరికొందరు తొలగించడంలేదు. అధికారులు ఇటీవల ఇచ్చిన మార్కింగ్‌పై విమర్శలు చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు వేసిన మార్కింగ్‌ను తప్పుపడుతున్నారు. గతంలో రెండు వైపులా రెవెన్యూ రికార్డుల ప్రకారం మార్కింగ్ ఇచ్చారు. అయితే ఇప్పుడు ఒక్కోచోట ఒక్కో రకంగా మార్కింగ్ వేశారని, మరలా మార్కింగ్ ఇచ్చేవరకు అక్రమ నిర్మాణాలు తొలగించమని బహిరంగంగానే అంటున్నారు. నిర్మాణాలు తొలగిస్తున్నవారిని ప్రేక్షకుల్లా చూస్తున్నారు..

రిజర్వు స్థలాలు అన్యాక్రాంతం

● స్వాధీనం చేసుకోండి: టీడీపీ

ధర్మవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో అన్యాక్రాంతమైన రిజర్వు స్థలాలను స్వాధీనం చేసుకోవాలని టీడీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. ఈ మేరకు టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రదానకార్యదర్శులు పరిశేసుధాకర్, పురుషోత్తం గౌడ్, 25వ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు తదితరులు గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సర్వేనెంబరు 626లో 7-17ఎకరాల విస్తీర్ణంలో 2012 నవంబరు 30న ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అప్పటి తహసీల్దార్ 4,5,6 ప్లాట్లను మున్సిపాలిటీ వారికి కేటాయించారని కమిషనర్‌కు వివరించారు. ఆ స్థలం ఎటువంటి ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వం నిషేధిత భూముల జాబితాలో చేర్చిందన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే కొంతమంది కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు నకిలీ పట్టాలను సృష్టించి మున్సిపల్ స్థలంలో బిల్డింగులు నిర్మించారని వివరించారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

ధర్మవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఆర్‌టీ వీధికి చెందిన మాధవి అలియాస్ జ్యోతి (51) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రంధి కృష్ణ, మాధవి దంపతులకు ఇద్దరు సంతానం. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మాధవి కాళ్లువిరిగి నడవలేని స్థితిలో ఉంది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది బుధవారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబసభ్యులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

పిల్లల కోసం సురక్షిత వ్యవస్థను నిర్మిద్దాం: ఆర్డీఓ



మాట్లాడుతున్న ఆర్డీఓ సువర్ణ

పుట్టపర్తిరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తు నిర్మాణం కోసం సురక్షితమైన వ్యవస్థను పునర్నిర్మించడంలో అందరూ బాగస్వాములవుదామని ఆర్డీఓ సువర్ణ పిలుపినిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ మిషన్ వాత్సల్య సంస్థ, ఐసీడీఎస్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ సువర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. పిల్లల హక్కుల పరిరక్షణలో, బాల్యవివాహాలను రూపుమాపడంలో అధికారులు బాధ్యత, తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ముఖ్యంగా బాలికల హాస్టళ్లలో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, గ్రామ బాలరక్షణ కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కౌమారదశలో ఉన్న బాల బాలికలకు ఆన్లైన్ డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. పుట్టపర్తి సబ్‌డివిజన్‌లో ప్రతి బిడ్డకు సురక్షితమైన సమ్మిళితమైన ప్రతిస్పందన వ్యవస్థను నిర్మించడానికి ప్రతి మండల అధికారి కృషి చేయాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో సీఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, డీపీఓ మహేష్, సోషియల్ వర్కర్ ఆనంద్, యూత్ అంబాసిడర్ సంజు, రెవిన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఎస్సైలు, శక్తిటీం పోలీసు సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. విద్యార్థులకు వరం

● సంబరాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా



సీఎం, విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కదిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం విద్యార్థుల చదువుకు ఓ వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా పేర్కొన్నారు. వీవర్సు కాలనీలోని మున్సిపల్ ఉన్నతపాఠశాలలో గురువారం తల్లికి వందనం అందుకున్న తల్లులతోపాటు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ రాజశేఖరాచారి సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే కందికుంట చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులతో పాటు టీడీపీ నాయకులు కేఎస్ బాహుద్దీన్, శిరి బాబ య్య, రమణ, కమిటీ చైర్మన్ జానీ, రమణ తదితరులు పాల్గొన్నారు.



గోవిందువారిపల్లిలో సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

తనకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రం పంచాయతీలోని గోవిందువారిపల్లి వద్ద ఉన్న సరస్వతి విద్యామందిరంలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు తల్లికి వందనం కార్యక్రమంపై సంబరాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే కందికుంట చిత్రపటాల వద్ద కేక్ కట్ చేశారు. నాయకులు సోంపాల్యం నాగభూషణం, మాజీ సర్పంచ్ గోవిందు, జనసేన మండల కన్వీనర్ కేవీ రమణతదితరులు పాల్గొన్నారు.



దొన్నికోటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నల్లమాడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం టీడీపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పాఠశాలలో గత యేడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు దొన్నికోటకు చెందిన టీడీపీ మండల మాజీ కన్వీనర్ కేశవరెడ్డి నగదు బహుమతులు అందజేశారు. 559 మా ర్కులు సాధించిన మహిత్రశ్రీకి రూ. 5వేలు, 488 మార్కులతో రెండో స్థానంలో నిలిచిన శ్రావణికి రూ. 2,500, 464 మార్కులతో మూడో స్థానం పొందిన నందినికి రూ. 15వందల నగదు అందించారు.

జీఓ నంబర్ 5ను సవరించాలని వినతి

ధర్మవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులు బదిలీలకు సంబంధించిన జీఓ నెంబరు 5ను సవరించాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్, వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జీవీవీ రాఘవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా కోరారు. ఈ మేరకు వారు మున్సిపల్ కమిష నర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. జీఓ నంబరు 5లో సచివా లయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి సొంత మండలాల్లో విధులు నిర్వహించరాదనే నిబంధనను సడలించాలని కోరారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఐదేళ్లు పూర్తి అయిన వారికి వార్డు టు వార్డు బదిలీలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఏపీ విలేజ్, వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నరసింహరావ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా వాయిదా

ధర్మవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 24న జరగాల్సిన జాబ్‌మేళాను వాయిదా వేసినట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు గురువారం తెలిపారు. అదేరోజు మంత్రి సత్యకుమార్‌కుమార్‌కు రాష్ట్ర కేబినెట్ సమావేశం ఉండటం వల్ల ఈమేళాను వాయిదా వేసినట్లు తెలిపారు. జూలై మొదటి లేదా రెండో వారంలో తిరిగి జాబ్‌మేళాను నిర్వహిస్తామన్నారు.

ఫాదర్ ఫెర్రర్‌కు ఘన నివాళి



ఫాదర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

బత్తలపల్లి/నల్లమాడ/నల్లచెరువు,జూన్19(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆ సంస్థ మహిళ సంఘాలు, సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో ఫాదర్ ఘాట్ వద్ద ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను రెన్యువల్ చేసి, సంస్థను కాపాడాలని కోరారు. కార్యక్రమవలో నాయకులు కాటమయ్య, రాంప్రసాద్, రామక్రిష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలకేంద్రమైన నల్లమాడలో, నల్లచెరువులోని మండలంలోని రాట్నాపల్లిలో విన్‌సెంట్ ఫెర్రర్ వర్ధంతిని నిర్వహించారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణకు వినతి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

కేంద్రం ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు, ప్రజలు గురువారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ తదితరులు గురువారం విన్నవించారు. ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించి ఆర్డీటీ సేవలు కొనసాగించేలా కృషి చేయాలని కోరారు. అలాగే ధర్మవరంలో సాయి రూరల్ విభిన్నప్రతిభావంతుల మండల సమాఖ్య సభ్యులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రమైన బుక్కపట్నం, బుచ్చయ్యగారిపల్లి, జానంకపల్లికి చెందిన మహిళలు మండలకేంద్రంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా నల్లచెరువు, నల్లమాడ, నంబులపూలకుంట, ఓబుళదేవరచెరువు, అమడగూరు మండలకేంద్రాల్లో ఆయా మండలాలకు చెందిన ప్రజలు సంబంధిత రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

న్యూస్ బాక్స్

లేపాక్షి హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, భక్తులు

లేపాక్షి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం లేపాక్షి దుర్గావీరభద్ర స్వామి హుండీ ఆదాయం ఏడునెలలకు గాను రూ.8,16,381 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి నరసింహ రాజు తెలిపారు. ఆలయ ఈఓ నరసింహమూర్తి, గ్రామస్థుల సమక్షంలో ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. రూ.8,16,381 ఆదాయం వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. ఆలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి: జడ్పీటీసీ


జడ్పీటీసీ ఉమేష్‌తో స్థానిక నాయకులు

అగళి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషిచేస్తానని అగళి జడ్పీటీసీ ఉమేష్ అన్నారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, హిందూపురం అబ్జర్‌గా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హిందూపురం నాయకులు, కార్యకర్తలు, అగళి నాయకులు, మడకశిర మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, కన్వీనర్ కుమారస్వామి, తిప్పేస్వామి, రాజగోపాల్, రాజన్న, కెంచప్ప పాల్గొన్నారు.

విన్సెంట్ ఫెర్రర్ కృషి చాలా గొప్పది


మాట్లాడుతున్న ఆర్డీటీ సిబ్బంది, ఉపాధ్యాయులు

రొళ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవితాల్లో వెలుగు నింపిన విన్సెంట్ ఫెర్రర్ కృషి గొప్పదని ఆర్డీటీ ఏరియా టీంలీడర్ ఓబులేసు అన్నారు. గురువారం స్థానిక జడ్పీ పాఠశాలలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో అన్ని రంగాల్లో విశేషంగా కృషిచేశారని కొనియాడారు. అనంతరం హైస్కూల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆర్డీటీ సిబ్బం ది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్న అమృత మహోత్సవాన్ని జయప్రదం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న వాల్మీకి నాయకులు

పావగడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రత్న సహకార మంత్రి కేఎన్ రాజన్న 75వ అమృతమహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పావగడ వాల్మీకి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. 21న తుమకూరులోని జూనియర్‌కళాశాల మైదానంలో ఆయన జీవితచరిత్ర పుస్తకావిష్కరణతోపాటు 75వ జన్మదినం, పావగడ తరుపున అధిక సంఖ్యలో వాల్మీకి నాయకులు తరలిరావాలని వేదిక అధ్యక్షుడు పాలేగార లోకేష్ పిలుపునిచ్చారు. వాల్మీకి సంఘం నాయకులు ఓంకార్‌నాయక్, పాపన్న, అంబికా రమేష్, బ్యాంక్ శీనప్ప, లక్ష్మీనారాయణ, రామాంజినప్ప, నాగరాజు, నాని పాల్గొన్నారు.

తిరుమలకు నందిని నెయ్యి తరలింపు


వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డైరెక్టర్లు

పావగడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుమలకు తుమకూరు జిల్లా నుంచి నందిని నెయ్యిని తరలించేందుకు గురువారం పావగడ ఎమ్మెల్యే, తుమల్ అధ్యక్షుడు హెచ్‌వి వెంకటేష్, డైరెక్టర్లు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. నందిని పాలు, నెయ్యి దేశవ్యాప్తంగా ఎంతో పేరుగాంచిందని తిరుమల లడ్డూ తయారీలో వాడటం తమ రాష్ట్రం చేసుకున్న అదృష్టమని ఎమ్మెల్యే అన్నారు. డైరెక్టర్లు మహాలింగయ్య, కృష్ణకుమార్, భారతిదేవి, శివప్రకాశ్, శ్రీనివాస్, పావగడ పారిశ్రామికవేత్త నాని, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టిన రోజు


నోటు పుస్తకాలతో విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు

పావగడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పావగడ తాలూకా కరియప్పన్నపాళ్య ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు సంస్కారవంతమైన విద్య నేర్చుకున్నప్పుడే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుజిత్‌రాజన్ అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్, సురేష్, చిన్నప్ప, మారుతి, రూపవతి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు కల్పించాలి

పెనుకొండ టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఓటుహక్కు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ, బూత్‌లలో సమస్యలుంటే, ఫారం 6, 7, 8 వినియోగంపై వివరించారు. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలని ఆయా పార్టీల ప్రతినిధులకు సూచించారు. తహసీల్దార్ శ్రీధర్, కమిషనర్ సురేష్, టీడీపీ నాయకులు రమణమ్మ, చంద్రకాంతమ్మ, బీజేపీ రామక్రిష్ణ, వైసీపీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరం..!

- మెనూ ప్రకారం వడ్డింపు
- విద్యార్థుల్లో ఆనందం


మధ్యాహ్న భోజనం కోసం క్యూలో నిల్చున్న విద్యార్థినులు

సోమందేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో కూటమి ప్రభుత్వం సమూల మార్పులు తీసుకురావడంతో విద్యార్థులు కడుపునిండా భోజనం చేస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 689మంది విద్యార్థులుండగా మెనూలో అన్నం, సాంబర్, గుడ్డు, చిక్కిని అందజేశారు. భోజనం రుచికరంగా ఉండటంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 75కేజీల బియ్యం వండినట్లు నిర్వాహకుడు తెలిపారు. సన్నబియ్యంతో అన్నం వండటంతో పూర్తిస్థాయిలో అయిపోతోందని ఆయన తెలిపారు. వండిన అన్నమంతా అయిపోగా


విద్యార్థులకు వడ్డించగా ఖాళీగా ఉన్న పాత్ర

తిరిగి వండి వడ్డించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నంబియ్యంతో వండటంవల్ల గతంలో మాదిరి భోజనం వృథా కావడంలేదన్నారు.

భోజనం రుచికరంగా ఉంది: ప్రతీక్, 10వ తరగతి విద్యార్థి



గతంలో మధ్యాహ్న భోజనం బాగుండేదికాదు. తిన్నంత తిని పారబోసేవారం. ఇప్పుడు కడుపునిండా భోజనం చేస్తున్నాం. భోజనం ఇంట్లో చేసినట్లుగా ఉంది.

ఆకలి తీరుతోంది: కార్తీక్, 8వ తరగతి విద్యార్థి



ప్రస్తుతం పాఠశాలలో వడ్డిస్తున్న అన్నం రుచికరంగా ఉండటంతో ఆకలి తీరుతోంది. ఇలాంటి భోజనం వడ్డిస్తే మాలాంటి విద్యార్థులకు ఆకలి బాధలు ఉండవు.

పురం నుంచి పలువురు పరిశీలకులు

హిందూపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలకు సంబంధించి ఇతర ప్రాంతాలకు హిందూపురం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులను పరిశీలకులుగా నియమించారు. ఇందులో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్‌ను తాడిపత్రి నియోజకవర్గానికి, కురుబకార్పొరేషన్ డైరెక్టర్ పరిమళను రాయదుర్గానికి నియమించారు. టీడీపీ పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ చంద్రమోహన్‌ను అగళి మండలానికి, ఐటీడీపీ అధ్యక్షుడు రామాంజనేయులు, చిలమత్తూరు మండల కన్వీనర్ ఎగువింటి శ్రీనివాసులును మడకశిర నియోజకవర్గంలోని మండలాలకు పరిశీలకులుగా నియమించారు. పరిశీలకులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఇతర ప్రాంతాలకు పరిశీలకులుగా పంపడంపట్ల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్దతు

పెనుకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరిగే ప్రజాస్వామిక ఉద్యమాలకు రాయలసీమ విద్యావంతుల వేదిక సంపూర్ణ మద్దతు ఉంటుందని వేదిక అధ్యక్షుడు రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం దళిత, గిరిజనుల మీద జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, ఆత్మహత్యలను ఖండిస్తూ రాయలసీమలో కూడా ఏర్పడిన ఐక్య సంఘటనలో పాల్గొంటూ తమవంతు పాత్ర పోషిస్తుందన్నారు. అనంతపురంలో జరిగిన గిరిజన విద్యార్థిని తన్మయి హత్య, రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికై జరిగిన అత్యాచారం, చిత్తూరు జిల్లా కుప్పంలో అప్పుకట్టలేదన్న నెపంతో మహిళను చెట్టుకు కట్టేసి దాడిచేయడం, కర్నూలు జిల్లా కౌతాళం మండలం నల్లారు గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటన జరగడం దారుణమన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

అగళి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ 21న ఉదయం 6 నుంచి 8-30 వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ యాదవేంద్ర పిలుపునిచ్చారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రతి ఉద్యోగి రాజకీయ నాయకులు, అధికార ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల ఉద్యోగుల పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

తల్లికి వందనంతో అమ్మకు ఆనందం

మడకశిర టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది పిల్లలు చదువుతున్న అంతమందికి రూ.13వేల ప్రకారం తల్లుల ఖాతాలో నగదు జమ చేయడంతో తల్లుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. మడకశిర నియోజకవర్గంలో 21,386 మంది విద్యార్థులకు వారి తల్లుల ఖాతాలో రూ.27.80కోట్ల నగదు జమ అయినట్లు ఎంఈఓ శ్రీనివాస్‌భాస్కర్ గురువారం తెలిపారు. మడకశిర మండలంలో 8105 మంది విద్యార్థులకు రూ.10,53,65,000, రొళ్లలో 3205 మందికి రూ.4,16,65,0000, అగళిలో 2385 మందికి రూ.3.10 కోట్లు, అమరాపురంలో 3600 మందికి రూ.4.68కోట్లు తల్లుల ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. తల్లికి వందనం నగదు జమకాని తల్లుల నుంచి అవసరం అయిన పత్రాలు తీసుకొని వారి ఖాతాలో జమ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నట్లు ఆయన తెలిపారు.

రక్తదానం

పెనుకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి అరుదైన ఓ నెగిటివ్ రక్తాన్ని దానంచేసి సోమందేపల్లి మండలం మంచేపల్లి గ్రామానికి చెందిన షంషీర్ పలువురి అభినందనలు అందుకున్నాడు. పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో కేరళకు చెందిన వ్యక్తికి గుండె ఆపరేషన్ కోసం ఓనెగిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయాన్ని డ్రైవర్ ద్వారా ఆత్మీయ రక్తదాతల సంస్థ వ్యవస్థాపకుడు ప్రసాద్‌కు తెలియడంతో ఆయన ఓనెగిటివ్ ఉన్న వ్యక్తిని అన్వేషించి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి పంపి రక్తాన్ని దానం చేయించారు. రక్తదానం చేసిన వ్యక్తిని సంస్థ అధ్యక్షులతోపాటు పలువురు అభినందించారు.

బూత్ కన్వీనర్లకు సూచనలు

పరిగి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నియమించిన సచివాలయ బూత్ కన్వీనర్లకు స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కన్వీనర్లు తమ పరిధిలోని సచివాలయాన్ని సందర్శించి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాలను సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కారమయ్యేవిధంగా సహాయపడాలన్నారు. సర్పంచ్ బాలాజీ, పాళ్యంచంద్ర, లక్ష్మణ్‌స్వామి, ఊటకూరుబాబు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

పెనుకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ కోశాధికారి సాంబశివ పిలుపునిచ్చారు. గురువారం సంఘం మండల అధ్యక్షుడు బాబావలి ఆధ్వర్యంలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి లేబర్‌కోడ్ బిల్లులు తీసుకొచ్చి కార్మిక హక్కులను హరించిందన్నారు. కార్మికులు సంఘటాలను పెట్టుకునే హక్కు కూడా లేకుండా పోతోందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, బాబావలి, నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బావమ్మ, ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరి, వెంకటేశ్, ఆరిఫ్, నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సోమందేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగేపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, సర్పంచ్ నరసింహులు పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా గురువారం రంగేపల్లి నుంచి రైల్వే స్టేషన్ వరకు మట్టిరోడ్డు పనులు చేపట్టారు. ఇచ్చిన కొలతలకు అనుగుణంగా పనులు నాణ్యంగా చేయాలని సూచించారు. ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పశువైద్యాధికారి

సోమందేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పశువైద్యాధికారిగా హేమలత గురువారం బాధ్యతలు చేపట్టారు. లేపాక్షి మండలం మానెంపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై సోమందేపల్లికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బాలాజీనాయక్ కొడిగెనహళ్లికి బదిలీపై వెళ్లారు. ఆమె మాట్లాడుతూ విధినిర్వహణలో బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. పాడిరైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

వ్యవసాయాధికారి...

రొద్దం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రొద్దం ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా రాజేష్ బాధ్యతలు చేపట్టారు. గురువారం రొద్దం వ్యవసాయ కార్యాలయంలో పెనుకొండ టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న రాజేష్, ఇన్‌చార్జి ఏఓగా నియమించగా బదిలీపై వెళ్తున్న నివేదిత నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. మండలంలో వ్యవసాయ పంటలపై అవగాహన చేసుకుని రైతులకు సకాలంలో ఎరువులు, మందులు, సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా హనుమన్న


ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కళ్యాణదుర్గం నుంచి బదిలీపై వచ్చిన హనుమన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఓబుళపతి బదిలీపై నల్లచెరువు వెళ్లడంతో స్థానిక పాఠశాల కమిటీ నాయకులు ఇద్దరినీ ఘనంగా సన్మానించారు. డీలర్ల సంఘం అధ్యక్షుడు బంగారుపాళ్యం తిప్పేస్వామి, ఎస్సీసెల్ అధ్యక్షుడు చెన్నప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మడకశిర రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయలు సమయపాలన తప్పనిసారిగా పాటించాలని ఎంఈఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. జిల్లేడుగుంట ప్రాథమికోన్నపాఠశాలలో ఉదయం 8.50 గంటలకు విద్యార్థులతో పాటు ప్రార్థనలో ఎంఈఓ పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయలుకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రైతులకు విద్యుత్ సామగ్రి అందజేత


రైతులకు విద్యుత్ సామగ్రిని అందజేస్తున్న ఏఈఈ సిద్దేశ్వర

అమరాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం 200 మంది రైతులకు విద్యుత్ సామగ్రిని పంపిణీ చేసినట్లు విద్యుత్ ఏఈఈ సిద్దేశ్వర తెలిపారు. రైతుల అవసరాల నిమిత్తం బోర్ల వద్ద కరెంటు సరఫరా కోసం వైర్లను అందజేసినట్లు తెలిపారు. విద్యుత్ సర్వీస్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు పంపిణీ చేశామన్నారు.

అనాథ వృద్ధురాలికి ఆశ్రయం


రత్నకుమారి

పెనుకొండ టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అనాథ వృద్ధురాలు రత్నకుమారి(80)కి జర్నలిస్టు కాలనీవాసులు ఆశ్రయం కల్పించారు. బుధవారం అర్ధరాత్రి ఒంటరిగా జర్నలిస్ట్ కాలనీలోకి రావడంతో గుర్తించి ఆమెకు దుప్పటి, బట్టలు, భోజన వసతి కల్పించారు. ఈమె వివరాలు ఆరాతీయగా ఈమెపేరు రత్నకుమారి అని తండ్రి గుర్రజక్కయ్య, తల్లి కాంతామణి, భర్త గండిజాన్, ఈమెది భీమవరమని తెలిపారు. అయితే అధికారులకు సమాచారం అందించి వృద్ధాశ్రమంలో చేర్పించాలని జర్నలిస్టు కాలనీవాసులు అన్నారు. బాబిరెడ్డి, రెడ్డమ్మ, నరేష్, సిరి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు


ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఏఓ చందన

పెనుకొండ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ చందన.. ఫర్టిలైజర్ షాపు యజమానులను హెచ్చరించారు. ఐదెకరాల్లో రూ.2లక్షలు పెట్టుబడి పెట్టి రెండు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు నిండాముంచిన నకిలీ విత్తనాలు అంటూ సర్వం నష్టపోయామని ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వ్యవసాయాధికారి చందన, సిబ్బందితో కలిసి పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. షాపులో విక్రయించిన ఎరువులు, విత్తనాల బిల్లులను రికార్డుల్లో తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలని లేనిపక్షంలో షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. రబీలో ఉష్ణోగ్రతలు పెరిగి మొక్కజొన్న, వరి దెబ్బతిని దిగుబడి తగ్గిందని రైతులకు వివరించారు.


ఎంజీఎం క్రీడా మైదానంలో పరిశీలిస్తున్న ఆర్డీఓ, మున్సిపల్ చైర్మన్ తదితరులు

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

హిందూపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 21వ తేదీన జరిగే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఎంజీఎం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ముఖ్య అధికారులు హాజరవుతారన్నారు. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ మల్లికార్జున, తహసీల్దార్ వెంకటేశులుకు ఆదేశించారు. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యతకు పెద్దపీట: మునిసిపల్ నిధులతో చేపట్టే ఏ పనైనా నాణ్యతకు పెద్దపీట వేస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. గురువారం కొల్లకుంట వద్ద కంపోస్ట్ నుంచి పైపులైన్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకి సంబంధించిన పనులు, పరికరాలను ప్రజలకు కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. ఎవరికైనా నాణ్యతలో అభ్యంతరం ఉంటే నిర్భయంగా ఫిర్యాదుచేయవచ్చన్నారు. పట్టణ కన్వీనర్ వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం, డిప్యూటీ సీఎం, నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం


రొద్దం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బూచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లికి వందనం నిధులు జమకావడంతో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గురువారం బూచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వానికి, తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఉపాధ్యాయులు కోరారు. టీడీపీ నాయకులు మంజునాథ్, చంద్రమౌళి, మల్లేష్, నాగరాజు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో నీటి ట్యాంకు


కూలేందుకు సిద్ధంగా ఉన్న నీటి ట్యాంకు

పరిగి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిగెనహళ్లిలో 70ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో 1957లో నిర్మించిన ట్యాంకు 25 మీటర్ల ఎత్తులో ఉంది. అదికాస్త శిథిలావస్థకు చేరడంతో దీని చుట్టుపక్కల మూడు నివాస గృహాలున్నాయి. ఆ ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని ఆ ఇళ్లలోనివారు బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్యల వలయంలో మధూడి గ్రామం


మధూడి గ్రామం

అగళి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలం మధూడి గ్రామం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలో 15 రోజులుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ మోటారుకు ఉన్న స్టార్టర్ మరమ్మతులకు గురికావడంతో సమస్యగా మారింది. సమస్యపై పలుమార్లు సర్పంచ్, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అలాగే బీసీ కాలనీలో వీధిలైట్లు లేక పురుగుల బెడ అధికమైందన్నారు. బయటకు రాలేక నానా ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. 2వేల మీటర్లు సీసీరోడ్డు నిర్మించాల్సి ఉందని, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం ప్రయాణికులు కూర్చోవడానికి బస్సు షెల్టర్ లేక రోడ్ల పక్కన నిలబడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలోపడి ఆవు మృతి


మృతి చెందిన పాడి ఆవు

చిలమత్తూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళ్లిన పాడిఆవు గోబర్ గ్యాస్ గుంతలో పడి మృతిచెందింది. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మారెప్ప తన పాడి ఆవును శుక్రవారం గ్రామ సమీపంలోని చెరువు వద్ద మేతకోసం తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న గోబర్ గ్యాస్ గుంతను గుర్తించక పాడిఆవు అందులో పడిపోయింది. గుర్తించడం ఆలస్యం కావడంతో నీటిలో పడిన పాడి ఆవు ఊపిరాడక మృతి చెందింది. ఎంతసేపటికి ఆవు రాకపోవడంతో అనుమానం వచ్చి అక్కడ గాలించగా గుంతలో విగతజీవిగా కనిపించింది. పాలు ఇస్తూ కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉన్న ఆవు మృతి చెందడంతో రైతు కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఇటీవలే రూ.80 వేల వెచ్చించి ఇంటికి తీసుకువచ్చాడు. ఇలా గుంతలో పడి మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయినట్లు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేబండ సమీపంలో శ్రీకైలాశ క్షేత్రంలో వెళ్లే రహదారిలో ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. కియ పోలీసులు తెలిపిన మేరకు మోహిత్, సాత్విక్ శ్రీకైలాసంకు వెళ్తుండగా వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పాలకొండల్‌రాయుడు శ్రీకైలాసం నుంచి దుద్దేబండకు ఆటోలో వస్తున్నాడు. దుద్దేబండ మలుపువద్దకు రాగానే ఆటో, ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో గుట్టూరుకు చెందిన మోహిత, సాత్విక్‌లకు తీవ్రగాయాలుకాగా ఆటో డ్రైవర్ పాలకొండ రాయుడు స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను ఆర్టీసీ బస్సులో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగదు చోరీ

హిందూపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి గురువారం ఓ బ్యాంకులో రూ.5లక్షలు నగదు డ్రా చేసుకున్నాడు. ఆ నగదును వాహనంలో పెట్టుకుని వీడీ రోడ్డులో పార్క్‌చేసి పనికోసం షాపులోకి వెళ్లి వచ్చేసరికి నగదు మాయమైంది. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇన్‌చార్జి సీఐ ఆంజనేయులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.